Follow: @ANNTELUGU

17-09-2026

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 238 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## సంగారెడ్డి జిల్లాలో గణేశ్ నిమజ్జనంలో ఘోర విషాదం

- సంగారెడ్డి జిల్లాలో గణేశ్ నిమజ్జనంలో ఘోర విషాదం
- చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు దుర్మరణం
- సీఎం రేవంత్ దిగ్భ్రాంతి
- పటాన్‌చెరులో విషాద ఛాయలు

**సంగారెడ్డి, మహా :** వినాయక నిమజ్జన వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని పెదకంజర్ల గ్రామ శివారులో ఉన్న నేరేడు చెరువులో మునిగి ఆరుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో పండుగ వాతావరణం ఒక్కసారిగా విషాదమయమైంది. మృతులంతా శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులుగా గుర్తించారు. శిరీష అనాథాశ్రమానికి చెందిన విద్యార్థులు గణేశ్ విగ్రహ నిమజ్జనం కోసం నేరేడు చెరువు వద్దకు వెళ్లారు. నిమజ్జనం చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు వారు ఒకరి తర్వాత

మిగతా 2వ పేజీలో

టాప్ న్యూస్

## యూపీఐ ఛార్జీలపై తగ్గేదిలేదన్న కేంద్రం

- అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి




02

## బీసీ రిజర్వేషన్లపై తీర్పు రిజర్వ్

- ఏపీ హైకోర్టు నిర్ణయంపై ఉత్కంఠ
- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను పరిశీలిస్తామన్న కోర్టు



02

## అందరి భూములపై సీబీఐ విచారణ జరగాలి

- గుంటనక్క.. గూఢచారిలను విచారిస్తారన్న నమ్మకం లేదు
- కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్



03



## కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

### అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన ప్రకటన

- కేసీఆర్ ఫామ్ హౌజ్ లో 388ఎకరాల ప్రభుత్వభూమి
- విచారణలో తేలితే.. ఆ భూమి దళితులకే పంచుతాం
- శుద్దిచేసిన చోటే.. దళితులకు భూములిచ్చి యాజమానులనుచేస్తాం
- కేసీఆర్ కుటుంబానికి అధికారికంగా 429 ఎకరాల భూమి
- సీలింగ్ చట్టానికి విరుద్దంగా భూములు
- త్వరలో ధరణి పార్ట్ -2 అక్రమాలు బయటపెడతాం
- 10 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేసిన బీజేపీ ఎమ్మెల్సీ

**హైదరాబాద్, మహా :**
22ఏతో తెలంగాణ ప్రభుత్వం పేదలను వేధిస్తోందని ఆరోపణలు వచ్చాయని, తమపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై వచ్చిన ఆరోపణల కారణంగా 22ఏ అంశంపై చర్చ చేపట్టామనని తెలిపారు. సభలో చర్చ చేపట్టామని, ప్రధాన ప్రతిపక్ష నేత సభకు రాలేదని తమ బాధ్యత నుంచి వెనక్కి పోలేదన్నారు. వివాదానికి ముగింపు పలకాలని సభ్యులు కోరితేనే చర్చ చేపట్టామని వెల్లడించారు. "సిద్దిపేటలో కేసీఆర్ కుటుంబానికి 67.5 ఎకరాలు ఉంది. కేటీఆర్ కుటుంబానికి 123 ఎకరాలు ఉంది. హరీశ్‌రావు కుటుంబానికి 30 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కవిత కుటుంబానికి 37 ఎకరాలు ఉంది. జోగినపల్లి సంతోష్‌రావు కుటుంబానికి 79 ఎకరాలు ఉంది. నవీన్‌రావుకు 52 ఎకరాలు, కొండల్‌రావుకు 48 ఎకరాలు ఉంది. కల్వకుంట్ల కుటుంబానికి 9 జిల్లాలోని 24 మండలాల్లో 31 గ్రామాల్లో 439 ఎకరాలున్నాయి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో సంచలన ప్రకటన చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. 30 రోజుల్లో విచారణ జరపాలని స్పష్టం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో 295 ఎకరాల భూమి ఉందని తెలిపారు. అసెంబ్లీలో 22ఏ అంశంపై చర్చ సందర్భంగా కేసీఆర్ కుటుంబ భూములు వివరాలు వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని ఆరోపించారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా లేదా తేల్చాలని స్పష్టం చేశారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతానని, శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని ఘంటాపథంగా చెప్పారు.

**కేటీఆర్ కుటుంబానికి 129 ఎకరాల భూమి**

ఒక కుటుంబానికి కుష్కి పొలం 54, తరి పొలమైతే 27ఎకరాలుండాలి. కేసీఆర్‌కు ఉన్నది మొత్తం తరి పొలమే. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలో కేసీఆర్, శోభిత పేరిట 67.5 ఎకరాలు. కేటీఆర్ పేరు మీద 49.5 ఎకరాలు, శైలిమ పేరిట 17.5ఎకరాలు. కేటీఆర్ పిల్లలు అలేఖ్య పేరిట 9.38, హిమాన్షు పేరిట 46.23 ఎకరాలు. కేటీఆర్ కుటుంబానికి మొత్తం 123.19 ఎకరాలు ఉంది" అని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. మొత్తం రూ.లక్ష కోట్ల భూకుంభకోణం జరిగిందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. భూకుంభకోణంపై స్పెషల్ ఎంక్వయిరీ టీమ్

మిగతా 02 పేజీలో

## సెమీకండక్టర్ పరిశ్రమకు సింగపూర్ ఆసక్తి సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ

02






## ఇవాక్యూ ప్రాపర్టీ @ 250 కోట్లు..!

### తూంకుంటలో బరితెగించిన అక్రమం ..!

- ఐదు ఎకరాల కస్టోడియన్ ప్రాపర్టీ గల్లంతు..?
- అలంకృత రిసార్ట్, రాగి కన్వెన్షన్, బాలాజీ గార్డెన్ కనుసన్నల్లోనే దురాక్రమణ..!
- కంచే చేను మేస్తే కాచేదెవరు..?
- పత్తా లేని రెవెన్యూ యంత్రాంగం..!
- కాందీశీకుల భూములు అక్రమార్కుల కస్టడీలోనేనా..?
- హైకోర్టు ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తున్న అక్రమార్కులు..!
- కలెక్టర్ స్పందించాలని కోరుతున్న పుర ప్రముఖులు..!

02

కాచేవాడే కైంకర్యం చేస్తుంటే కస్టోడియన్ భూములకు రక్షణ ఎక్కడ? మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా శామీర్పేట్ మండలం తూంకుంట పరిధిలో విలువైన కాందీశీకుల (ఇవాక్యూ) ప్రాపర్టీ అక్రమార్కుల చెరలో చిక్కి విలవిల్లాడుతోంది. అన్యాక్రాంతమవుతున్నా అధికారుల్లో మాత్రం చీమకుట్టినట్టయినా లేదు. ఏకంగా రూ. 250 కోట్ల మార్కెట్ విలువ కలిగిన ఐదు ఎకరాల ఖరీదైన కస్టోడియన్ ప్రాపర్టీని అక్రమార్కులు కబలిస్తున్నా, స్థానిక రెవెన్యూ యంత్రాంగం చోద్యం చూస్తూ పత్తా లేకుండా పోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్థానికంగా పేరుమోసిన అలంకృత రిసార్ట్, రాగి కన్వెన్షన్, బాలాజీ గార్డెన్‌ల కనుసన్నల్లోనే ఈ భారీ దురాక్రమణ పర్వం యథేచ్ఛగా కొనసాగుతోందని వారు బహిరంగానే చర్చించుకుంటున్నారు . అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, అక్రమార్కులు ఆ ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ దందాలు కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోర్టు ఉత్తర్వులను అమలు చేయాల్సిన బాధ్యత కలిగిన అధికారులు మౌనం వహించడం వెనుక ఆంతర్యమేమిటనే ప్రశ్న స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.కస్టోడియన్ ఆస్తుల పరిరక్షణ గాలికొదిలేసిన ఈ ఉదంతంపై పుర ప్రముఖులు, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్వయంగా రంగంలోకి దిగి, ఈ అక్రమాలపై తక్షణమే స్పందించి... కోట్ల విలువైన కస్టోడియన్ సంపదను కాపాడాలని ముక్తకంఠంతో స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.




కస్టోడియన్ భూమిలో ఉన్న అలంకృత రిసార్ట్



కస్టోడియన్ భూమిలో ఉన్న బాలాజీ గార్డెన్

## 2028లో బీజేపీతో పొత్తు ఉండదు

- ఢిల్లీలో కేటీఆర్

02

## అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు

ఖరారుచేసిన తెలంగాణ ప్రభుత్వం

03

## ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

- భక్తుల అనుభూతిని పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- రూ.104 కోట్లతో ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం ప్రారంభం
- భక్తుల సౌకర్యార్థం 32 ఈవీ బస్సులు అందించిన రిలయన్స్, భారత్ బయోటెక్
- తిరుమలలో మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

03



## దానం అనర్హతపై హైకోర్టు తీర్పు వాయిదా

**హైదరాబాద్, మహా :** పార్టీ ఫిరాయింపు కేసు విచారణలో భాగంగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్ పై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు.. తీర్పు వాయిదా వేసింది. తదుపరి విచారణను హైకోర్టు డివిజన్ బెంచ్ శుక్రవారానికి వాయిదా వేసింది.గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ .. కాంగ్రెస్ పార్టీలో చేరారని, ఆయనపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కు బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పలు కీలక పరిణామాల అనంతరం సుప్రీం కోర్టు ఆదేశాలతో విచారణ చేపట్టిన స్పీకర్.. చట్టపరంగా దానం పార్టీ మారలేదని వెల్లడించారు. ఈ తీర్పును తీవ్రంగా ఖండించిన బీఆర్ఎస్, బీజేపీ.. తదుపరి చర్యలు తీసుకుంది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ పై ఆగస్టు 21న విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఇరుపక్షాల వాదనలు విని తీర్పు రిజర్వ్ చేశారు. తాజాగా ఈ పిటిషన్ పై న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల వాదనలు, లేవనెత్తిన అంశాలను పరిగణలోకి తీసుకున్న అత్యున్నత న్యాయస్థానం.. శుక్రవారానికి తీర్పు వాయిదా వేసింది.



# ఇవాక్యూ ప్రాపర్టీ @ 250 కోట్లు..!

**మహా, బ్యూరో చీఫ్, హైదరాబాద్ :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, కీసర సర్కిల్, షామీర్‌పేట్ మండలం తూంకుంట డివిజన్ కస్టోడియన్ (ఇవాక్యూ) భూముల వ్యవహారం రోజురోజుకూ వివాదాస్పదంగా మారుతోంది. సుమారు 24 ఎకరాల 24 గుంటల విస్తీర్ణంలో ఉన్న వందల కోట్ల విలువైన భూముల్లో దాదాపు ఐదు ఎకరాల భూమి అదృశ్యమైట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్ విలువ ప్రకారం రూ. 250 కోట్లకు పైగా విలువ చేసే కాంధీశీకుల భూములపై అక్రమార్కుల కన్నుపడిందని స్థానికులు, భూమి హక్కుదారుల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

అలంకృత రిసార్ట్, రాగి కన్వెన్షన్, బాలాజీ గార్డెన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ఈ భూముల్లో వివాదాలు, కోర్టు కేసులు కొనసాగుతున్నప్పటికీ యథేచ్ఛగా నిర్మాణాలు, తవ్వకాలు, భూ చదును పనులు కొనసాగుతున్నాయని ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ రికార్డుల్లో ఉన్న కస్టోడియన్ భూములు క్రమంగా అక్రమార్కుల ఆధీనంలోకి వెళ్తున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**దేశ విభజన నాటి పునరావాస భూములు..!**

1947 దేశ విభజన అనంతరం పాకిస్తాన్ నుండి భారతదేశానికి వచ్చిన కాందిశీకుల పునరావాసం కోసం కేంద్ర ప్రభుత్వం "ది డిస్ప్లేస్డ్ పర్సన్స్ (కాంపెన్సేషన్ అండ్ రిహాబిలిటేషన్) రూల్స్ 1955" ప్రకారం భూములను కేటాయించింది. ఈ క్రమంలో మువ్మల్ దేవి కన్వర్మల్ లఖ్వానీ కుటుంబానికి తూంకుంట గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 81 నుంచి 87 వరకు 24 ఎకరాల 24 గుంటల భూమి కేటాయించబడింది. అనంతరం 1968 లో కేంద్ర ప్రభుత్వం సనద్ జారీ చేసి సంపూర్ణ హక్కులు కల్పించింది.

**సివిల్ కోర్టుల్లోనూ వారసులకే అనుకూల తీర్పులు..!**

మువ్మల్ దేవి మరణానంతరం ఆమె కుమారులు ఫాతుమల్, విశాందాస్‌లు మరియు వారి కుటుంబ సభ్యులు ఉమ్మడి హక్కుదారులుగా కొనసాగారు. అయితే కాలక్రమేణా భూమిపై వివాదాలు మొదలయ్యాయి.

టి. రాజయ్య అనే వ్యక్తి దాఖలు చేసిన O.S.No.100/1968 సివిల్ దావాను నాంపల్లి కోర్టు కొట్టివేయగా, అనంతరం A.S.No.114/1973 అప్పీలును కూడా సిటీ సివిల్ కోర్టు తిరస్కరించినట్లు వారసుల తరఫు పత్రాల్లో పేర్కొన్నారు. దీంతో ఈ భూములకు సంబంధించి గతంలో దాఖలైన O.S.No.100/1968 దావా, తదనంతరం A.S.No.114/1973 అప్పీలు కొట్టివేయబడినట్లు సంబంధిత పక్షాలు పేర్కొంటున్నాయి. దీంతో ఈ భూములపై వారసుల హక్కులు గతంలోనే న్యాయస్థానాల ద్వారా గుర్తింపు పొందినట్లు వారు పేర్కొంటున్నారు.



**ప్రస్తుతం హక్కుదారులు, పిటిషనర్లు ఎవరు..?**

ప్రస్తుతం దివంగత విశాందాస్ కన్వర్మల్ లఖ్వానీ భార్య ఇందిరాబాయి లఖ్వానీ, కుమారులు రాజ్‌కుమార్ లఖ్వానీ, అనిల్ కుమార్ లఖ్వానీ, రాజేష్ కుమార్ లఖ్వానీలు హక్కుదారులుగా పేర్కొంటున్నారు. వీరి తరఫున జీపీఏ హోల్డర్‌గా రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పి. రామ్ గోపాల్ రావు వ్యవహరిస్తున్నారు. వీరితో పాటు ఎం/ఎస్ సార్గోరాప్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఎం/ఎస్ బగ్గా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్, డాక్టర్ గుండా లక్ష్మారెడ్డి, డాక్టర్ మర్రి సత్యనారాయణ రెడ్డి, జి. విజయ్ రెడ్డి, శ్రీమతి దొంతి రెడ్డి కమల తదితరులు కూడా హైకోర్టు కేసులో పిటిషనర్లుగా ఉన్నారు.

**అలంకృత, రాగి కన్వెన్షన్, బాలాజీ గార్డెన్స్ కనుసన్నల్లోనే దురాక్రమణ !**

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కోట్ల విలువైన 'కస్టోడియన్ భూముల అక్రమంగా ఆక్రమించిన ప్రధాన సూత్రధారులు అలంకృత రిసార్ట్, రాగి కన్వెన్షన్, మరియు బాలాజీ గార్డెన్స్ నిర్వాహకులేనని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చట్టాలను బొందపెట్టి, ప్రభుత్వ కస్టోడియన్ ఆస్తులను తమ సొంత వ్యాపారాల కోసం దర్జాగా మింగేసిన ఈ ముగ్గురి ఆక్రమణల వివరాలు:

అలంకృత రిసార్ట్:* కస్టోడియన్ భూములకు ఉన్న ప్రభుత్వ హద్దులను చెరిపేసి, ఆ విలువైన స్థలాలను రిసార్ట్ ప్రాంగణంలోకి విలీనం చేసుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలు ఉన్నాయి.

**రాగి కన్వెన్షన్:**

కస్టోడియన్ ఆధీనంలో ఉండాల్సిన భూమిని ప్రత్యక్షంగా ఆక్రమించి, తమ కన్వెన్షన్ సెంటర్ పార్కింగ్, ఇతర ఈవెంట్ అవసరాల కోసం అక్రమంగా వినియోగిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**బాలాజీ గార్డెన్స్:**

ప్రభుత్వ ఆస్తులపై నిఘా లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని, కస్టోడియన్ భూములను తమ గార్డెన్ సరిహద్దుల్లోకి నెట్టేసి ఆక్రమణలు కొన సాగిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి .

**హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు..!**

ప్రస్తుతం తూంకుంటలో కస్టోడియన్ భూములకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో W.P.No.10916/2026, W.P.No.8541/2022 తో పాటు ఇతర కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. 2026 ఏప్రిల్ 28న హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల్లో చట్టబద్ధమైన ప్రక్రియ అనుసరించకుండా రెవెన్యూ అధికారులు, పోలీసులు పిటిషనర్ల స్వాధీనంలో జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేసింది. అదే సమయంలో భూమి స్వరూపాన్ని మార్చవద్దని పిటిషనర్లను కూడా ఆదేశించింది.

**కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండగానే నిర్మాణాలా..?**

ఒకవైపు హైకోర్టు ఉత్తర్వులు అమల్లో ఉండగా, మరోవైపు సర్వే నంబర్లు 81 నుండి 87 వరకు ఉన్న కస్టోడియన్ భూముల్లో తవ్వకాలు, ప్రికాస్ట్ వాల్స్, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. భవిష్యత్తులో థర్డ్ పార్టీ హక్కులు సృష్టించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానాలను జీపీఏ హోల్డర్ పి. రామ్ గోపాల్ రావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కేంద్ర ప్రభుత్వ కస్టోడియన్ భూములను దురాక్రమణ చేసిన ఈ ముగ్గురిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, హైడ్రా సంబంధిత అధికారులు రంగంలోకి దిగి ఆక్రమిత భూములను వెంటనే స్వాధీనం చేసుకోవాలని స్థానికులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**కంచే చేను మేస్తే కాచేదెవరు..?**

కోట్లాది రూపాయల విలువైన కస్టోడియన్ భూములపై వివాదాలు కొనసాగుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భూములను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగమే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందా..? లేక మరేదైనా కారణాల వల్ల చర్యలు నిలిచిపోయాయా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**ఐదు ఎకరాల భూమి గల్లంతుపై విచారణ జరపాలంటున్న స్థానికులు...!**

తూంకుంట సర్వే నంబర్లు 81 నుంచి 87 వరకు ఉన్న మొత్తం 24 ఎకరాల 24 గుంటల భూమి కస్టోడియన్ ప్రాపర్టీ లిస్టులో ఉన్నప్పటికీ, దాదాపు ఐదు ఎకరాల భూమి క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక సర్వే నిర్వహించి వాస్తవాలు వెలికితీయాలని వారు కోరుతున్నారు.

**కలెక్టర్ జోక్యం చేసుకోవాలని డిమాండ్..!**

కోర్టు కేసులు, ప్రభుత్వ రికార్డులు, సనద్ పత్రాలు, భూ హక్కుల అంశాలను సమగ్రంగా పరిశీలించి జిల్లా కలెక్టర్ ప్రత్యేక విచారణకు ఆదేశించాలని పుర ప్రముఖులు కోరుతున్నారు. ఉమ్మడి సర్వే నిర్వహించి వాస్తవాలను వెలికితీయడంతో పాటు, అక్రమ నిర్మాణాలు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకుని కస్టోడియన్ భూములను పరిరక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# సంగారెడ్డి జిల్లాలో గణేశ్ నిమజ్జనంలో ఘోర విషాదం

( మొదటి పేజీ తరువాయి )

ఒకరు నీటిలో మునిగిపోయారు. సమాచారం అందుకున్న పటాన్‌చెరు పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలించి విద్యార్థుల మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. అనాథాశ్రమ నిర్వాహకులను పరామర్శించిన ఆయన, ఈ ఘటనపై తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మృతులను నర్సింహా రాజు, సుమంత్ (డిప్లొమా), గణేశ్ (డిప్లొమా), ఉదయ్ కిరణ్ (డిప్లొమా), శ్యామ్ కుమార్ (డిప్లొమా), సిద్ధార్థ్ (10వ తరగతి)గా గుర్తించారు. ఈ హృదయవిదారక ఘటనతో స్థానికంగా తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

**రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు, పెద్దకంజర్ల గ్రామంలో వినాయక నిమజ్జనానికి వెళ్లిన ఆరుగురు విద్యార్థులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్ని చోట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

# 2028లో బీజేపీతో పొత్తు ఉండదు

**ఢిల్లీలో కేటీఆర్**

: ప్రజలు సమస్యలతో తమ వద్దకు వచ్చినప్పుడు నాయకులు హడావుడి నిర్ణయాలు, తాత్కాలిక చర్యలకు పరిమితం కాకుండా.. సమగ్రమైన, దీర్ఘకాలిక పరిష్కారాల వైపు దృష్టి సారించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. బుధవారం న్యూఢిల్లీలోని ఇండియా హ్యాబిటాట్ సెంటర్‌లో 'జనాగ్రహ' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరాల అభివృద్ధిపై నిర్వహించిన 'షెహరోన్ పే చర్చ' ప్యానెల్‌లో ఆయన పాల్గొన్నారు. ఎంపీలు మహువా మాజి, ఎస్. నిరంజన్ రెడ్డి, జనాగ్రహ సీఈవో శ్రీకాంత్ విశ్వనాథన్‌లతో కలిసి భారతీయ నగరాల భవిష్యత్తుపై కేటీఆర్ చర్చించారు. ఈ సందర్భంగా గత కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేసిన ఉత్తమ విధానాలను ఆయన వివరించారు. మహానగరమైన హైదరాబాద్‌పై వలసల భారం తగ్గించేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులతో పాటు ద్వితీయ శ్రేణి నగరాల్లో ఐటీ టవర్లను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. నగర పాలక సంస్థలకు నిధుల లభ్యత ప్రధాన సవాలుగా మారిందని, నగరాలను వేధిస్తున్న సమస్యల పరిష్కారానికి అందరినీ కలుపుకుపోయే వినూత్నమైన ప్రణాళికలు అవసరమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. పట్టణ, ప్రజా రవాణా వ్యవస్థల గురించి వివరిస్తూ.. ప్రభుత్వాలు హైస్పీడ్ రైల్ నెట్‌వర్క్‌లను మెరుగుపరచడంపై దృష్టి సారిస్తే మహానగరాలపై కచ్చితంగా ఒత్తిడి తగ్గుతుందన్నారు. బీజేపీతో పొత్తుపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ "బీజేపీతో ఎలాంటి పొత్తు ఉండదు" అని కేటీఆర్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ అంశంపై మాట్లాడుతూ, లోక్‌సభ స్థానాల సంఖ్యను అన్ని రాష్ట్రాలకు ప్రస్తుత ప్రాతినిధ్య నిష్పత్తికి అనుగుణంగా పెంచితే డీలిమిటేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో 24 శాతం ప్రాతినిధ్యం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి ప్రయాణాన్ని వివరిస్తూ.. మౌలిక సదుపాయాలు, నమ్మకమైన ప్రజాసేవల ద్వారా ప్రభుత్వం 'నిశ్చితత్వం' కల్పించడంతో పాటు ఆవిష్కరణలు, స్టార్టప్‌లు, కొత్త అవకాశాలకు 'సాధ్యత' కల్పించే వాతావరణాన్ని నిర్మించాలని వివరించారు.

# స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పాఠశాలల క్రీడలు

**మండల స్థాయి ఆటల పోటీల సెలక్షన్**

**జూలూరుపాడు, మహా:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్) పాఠశాలల క్రీడలు, మండల స్థాయి ఆటల పోటీలు, ఎంపికను ఈనెల 18, 19 తేదీలలో నర్సాపురం ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14 బాల, బాలికలు అండర్ 17 బాల, బాలికల ఎంపిక జరగనున్నట్లు తెలిపారు. అండర్ 14 క్రీడలలో పాల్గొనే బాల, బాలికలు 01 012013 తర్వాత జన్మించిన వారై ఉండాలని, అండర్ 17 క్రీడలలో పాల్గొనే బాల, బాలికలు 01 012010 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. 18 వ తారీకు న అండర్ 14, 17 ఇయర్స్ బాలికలకు, 19 న అండర్ 14, 17 ఇయర్స్ బాలుర సెలక్షన్స్ జరుగుతుందన్నారు. కబడ్డీ అండర్ 14 బాలురు 51 కేజీ, బాలికలు 48 కేజీలు, అండర్ 17 ఇయర్స్ బాల బాలికలు 55 కేజీల వరకు బరువు వరకు ఉండవచ్చునని ఎంఈఓ జుంకీలాల్ తెలిపారు.

# వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

**కరీంనగర్ మహా:** కరీంనగర్‌లో ఈ నెల 23న నిర్వహించనున్న వినాయక నిమజ్జనోత్సవాన్ని బ్రహ్మాండంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. గతంలో ఎదురైన ఇబ్బందులు పునరావృతం కాకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం రాత్రి మానకొండూరు చెరువు, చింతకుంట కాకతీయ కెనాల్, కొత్తపల్లి ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్యం, భారీ క్రేన్లు, జాలర్లు, ట్రాఫిక్ నియంత్రణ వంటి సౌకర్యాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటిని అందుబాటులో ఉంచాలని సాగునీటి శాఖ అధికారులను ఆదేశించారు. మానకొండూరు వద్ద భారీ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం కానున్నందున ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యుత్ లైన్లు, రహదారులు, నిమజ్జన ప్రదేశాలను ముందుగానే పరిశీలించి భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. శోభాయాత్రల సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రజలు శభాష్ అనేలా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని బండి సంజయ్ కోరారు.

# సెమీకండక్టర్ పరిశ్రమకు సింగపూర్ ఆసక్తి

**సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ**

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో సెమీకండక్టర్ పరిశ్రమ ఏర్పాటు చేసే అవకాశాలపై సింగపూర్ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఇంధన-వాణిజ్య విభాగం శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం బుధవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, మూసీ పునరుజ్జీవనం, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో సింగపూర్ ప్రతినిధులు సెమీకండక్టర్ రంగంలో తెలంగాణలో పరిశ్రమ ఏర్పాటుపై సానుకూల ఆసక్తి వ్యక్తం చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

**పెట్టుబడులకు అన్ని విధాలా సహకారం**

తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అనుకూల పరిస్థితులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సింగపూర్ ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఆర్థికంగా భాగస్వాములు కావాలని కోరారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఆధునిక పారిశ్రామిక మౌలిక వసతులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్య మానవ వనరులు, పరిశోధన-అభివృద్ధికి ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సింగపూర్ ప్రతినిధులను సీఎం కోరారు. తెలంగాణలో సెమీకండక్టర్ రంగానికి ఇప్పటికే ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోంది. గతంలోనూ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులకు కేంద్ర అనుమతులు, పారిశ్రామిక పార్కుల ఏర్పాటుపై రాష్ట్రం ప్రయత్నాలు చేసినట్లు అధికారిక సమాచారం ఉంది.

**గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం**



డిసెంబరులో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆగస్టిన్ లీని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచస్థాయి పారిశ్రామిక సంస్థలకు పరిచయం చేసేందుకు ఈ సదస్సును వేదికగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. సింగపూర్ సంస్థలు తెలంగాణలో మరింత విస్తృతంగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని సీఎం కోరారు.

**మూసీ పునరుజ్జీవనంపై వివరణ**

సింగపూర్ ప్రతినిధులకు హైదరాబాద్ అభివృద్ధి ప్రణాళికలను కూడా రేవంత్‌రెడ్డి వివరించారు. మూసీ పునరుజ్జీవనంలో భాగంగా తొలిదశలో మూసా, ఈసా నదుల సంగమ ప్రాంతం నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

మూసీ నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు నది తీరంలో రివర్‌ఫ్రంట్, రాత్రివేళ ఆర్థిక కార్యకలాపాలకు అనువైన వాతావరణం కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. హైదరాబాద్‌ను కేవలం పర్యాటక నగరంగా కాకుండా ప్రపంచస్థాయి జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని వివరించారు.

**నెట్-జీరో నగరంగా ఫ్యూచర్ సిటీ**

భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలను కూడా సీఎం ప్రతినిధి బృందానికి వివరించారు. ఫ్యూచర్ సిటీని నెట్ జీరో నగరంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సుమారు 30 వేల ఎకరాల్లో ప్రతిపాదిత భారత్ ఫ్యూచర్ సిటీ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో అభివృద్ధి చేయనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే వివరించింది. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ కోసం సింగపూర్‌కు చెందిన సంస్థ పనిచేస్తున్నట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

**ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలకు హైదరాబాద్**

హైదరాబాద్‌ను అంతర్జాతీయ జ్ఞాన కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాల్లో భాగంగా ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలను నగరానికి ఆకర్షిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి తెలిపారు. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ వంటి సంస్థలు హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ల ఏర్పాటుకు అంగీకరించినట్లు సమావేశంలో ప్రస్తావించారు. విద్య, పరిశోధన, సాంకేతికత, పరిశ్రమలు పరస్పరం అనుసంధానమయ్యేలా హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం వివరించారు. సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, సింగపూర్ వాణిజ్య-పరిశ్రమల మంత్రిత్వ శాఖ దక్షిణాసియా సీనియర్ డైరెక్టర్ డాక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, సింగపూర్ కాన్సుల్ జనరల్ విలియం చిక్‌తో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. సెమీకండక్టర్ రంగంతో పాటు మూసీ పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ, జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ పెట్టుబడుల అంశాలపై జరిగిన చర్చలతో తెలంగాణ-సింగపూర్ పారిశ్రామిక సహకారానికి కొత్త అవకాశాలు తెరుచుకున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

# యూపీఐ ఛార్జీలపై తగ్గేదిలేదన్న కేంద్రం

**అక్టోబర్ 15 నుంచి కొత్త ఛార్జీలు అమల్లోకి**

**ఢిల్లీ, మహా :** రూ. 2,000 దాటిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేటు (ఎండీఆర్) విధించే నిర్ణయంపై వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నూతన విధానం 2026 అక్టోబర్ 15 నుంచి అమల్లోకి వస్తుందని, దీనిపై పునరాలోచన చేసే ఉద్దేశం లేదని ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి వెల్లడించారు. అయితే, ఈ ఛార్జీలు కేవలం వ్యాపారులకు మాత్రమే వర్తిస్తాయని, యూపీఐ ద్వారా చెల్లింపులు చేసే వినియోగదారులపై ఎలాంటి అదనపు భారం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. వ్యక్తి నుంచి వ్యక్తికి జరిపే నగదు బదిలీలు (పీ2పీ) ఎప్పటిలాగే ఉచితంగానే కొనసాగుతాయి. అలాగే, క్యూఆర్ కోడ్‌ల ద్వారా నెలకు రూ.1 లక్ష వరకు చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు ఈ ఛార్జీల నుంచి మినహాయింపు కల్పించారు. దేశంలో 95 శాతం వ్యాపార లావాదేవీలు రూ.2,000 లోపే జరుగుతున్నాయని ఈ సందర్భంగా అధికారులు గుర్తుచేశారు. యూపీఐ వ్యవస్థను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. గతంలో 'జీరోఎండీఆర్' ప్రోత్సాహక పథకం కోసం ప్రభుత్వం ఏటా సుమారు రూ. 2,000 కోట్లు వెచ్చించాల్సి వచ్చేదని, కొత్త విధానంతో ఆ భారం తప్పుతుందని భావిస్తోంది.

# ముద్దం నరసింహస్వామిని సత్కరించిన గుజరాత్ వీసీ

- **ఏఐ ఇన్ మోడ్రన్ జర్నలిజం' పుస్తకంపై డా. జేఎం వ్యాస్ ప్రశంసలు**
- **జర్నలిజంలో ఏఐ, మెటావర్స్ ప్రాధాన్యాన్ని వివరించిన వైస్ ఛాన్సలర్**
- **ఎన్‌ఎఫ్‌ఎస్‌యూలో మెటావర్స్ అధ్యాయం బోధిస్తున్నట్లు వెల్లడి**

**హైదరాబాద్, మహా:** 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ మోడ్రన్ జర్నలిజం' పుస్తక రచయిత, సాంకేతిక జర్నలిజం నిపుణుడు ముద్దం నరసింహ స్వామిని నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్‌ఎఫ్‌ఎస్‌యూ) వ్యవస్థాపక వైస్ ఛాన్సలర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డా. జేఎం వ్యాస్ అభినందించారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉన్న ఎన్‌ఎఫ్‌ఎస్‌యూను సందర్శించిన తెలంగాణ జర్నలిస్టుల బృందంతో వైస్ డా. జేఎం వ్యాస్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముద్దం నరసింహ స్వామి రాసిన పుస్తకాన్ని పరిశీలించిన డా. వ్యాస్.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ, జర్నలిజంలో వాటి వినియోగాన్ని విశ్లేషించిన తీరు ప్రశంసనీయమన్నారు. ముఖ్యంగా ఈ పుస్తకంలోని 'మెటావర్స్' అధ్యాయం తమ విశ్వవిద్యాలయంలో బోధిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ముద్దం నరసింహ స్వామిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఐబీ ఐఐఎస్ అధికారిణి వర్గంటి గాయత్రి, తెలంగాణ జర్నలిస్టుల బృందం పాల్గొంది. జర్నలిజంలో కృత్రిమ మేధ, మెటావర్స్, డిజిటల్ సాంకేతికతల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశాలపై రూపొందుతున్న పుస్తకాలు జర్నలిస్టులు, మీడియా విద్యార్థులు, పరిశోధకులకు ఉపయోగకరంగా ఉంటాయని డా. వ్యాస్ పేర్కొన్నారు.

ఫోరెన్సిక్ విద్య, పరిశోధనపై అవగాహనప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) హైదరాబాద్ ఆధ్వర్యంలో గుజరాత్ పర్యటనకు వెళ్లిన తెలంగాణ జర్నలిస్టుల బృందం ఎన్‌ఎఫ్‌ఎస్‌యూను సందర్శించింది. విశ్వవిద్యాలయంలోని విద్య, పరిశోధన, శిక్షణ కార్యక్రమాలను డా. జేఎం వ్యాస్ వివరించారు. ఫోరెన్సిక్ సైన్స్, బిహేవియరల్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఇన్వెస్టిగేషన్ విభాగాలపై అవగాహన కల్పించారు. అనంతరం జర్నలిస్టుల బృందం ఆధునిక ప్రయోగశాలలు, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్ మౌలిక వసతులను పరిశీలించింది.




# బీసీ రిజర్వేషన్లపై తీర్పు రిజర్వ్ ఏపీ హైకోర్టు నిర్ణయంపై ఉత్కంఠ

**రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ నివేదికను పరిశీలిస్తామన్న కోర్టు**

**అమరావతి, మహా :** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోలపై దాఖలైన పిటిషన్‌పై ఏపీ హైకోర్టు విచారణను ముగించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ వ్యవహారంపై తన తీర్పును రిజర్వ్ చేసింది. ప్రభుత్వ నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం ప్రకటిస్తామని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం ఇటీవల 1065, 105 జీవోలను జారీ చేసింది. అయితే, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల మొత్తం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా నిర్దేశించిన 50 శాతం పరిమితిని దాటుతున్నాయని, ఈ జీవోలను చట్టవిరుద్ధంగా ప్రకటించాలని కోరుతూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా జీవోలను సవరించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఆయన తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్‌పై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా ప్రభుత్వ తీరుపై ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని కమిషన్‌ను ఏర్పాటు చేయడానికి గల ప్రధాన ఉద్దేశం ఏమిటని ప్రశ్నించింది. ఆ కమిషన్ నియామక ఉత్తర్వులను కోర్టు ముందు ఉంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. 34 శాతం రిజర్వేషన్లను సిఫారసు చేయడానికి కమిషన్ ఎలాంటి అధ్యయనం చేసింది? అందుకు ఆధారంగా తీసుకున్న గణాంకాలు, ప్రాతిపదిక ఏమిటి? అనే వివరాలను సమగ్రంగా తెలియజేయాలని ధర్మాసనం ప్రభుత్వాన్ని కోరింది. కమిషన్ సమర్పించిన పూర్తి నివేదికను తామే స్వయంగా పరిశీలిస్తామని స్పష్టం చేసింది. గతంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలను కూడా కోర్టు ముందు ఉంచాలని, ఆ సర్వే ఉద్దేశంపై స్పష్టత ఇవ్వాలని ఆదేశించింది. ప్రభుత్వం సమర్పించే అన్ని నివేదికలు, గణాంకాలు, ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే స్థానిక సంస్థల్లో బీసీలకు 34% రిజర్వేషన్ల అంశంపై తుది నిర్ణయం వెలువరిస్తామని ధర్మాసనం తేల్చిచెప్పింది. ఈ క్రమంలో తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు తీర్పును రిజర్వ్‌లో ఉంచుతున్నట్లు ప్రకటించింది. హైకోర్టు తీర్పుతోనే స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల భవిష్యత్తు తేలనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# సత్తుపల్లి అభివృద్దే.. ఎమ్మెల్యే రాగమయి లక్ష్యం..

సచివాలయంలో ఉన్నతాధికారులతో భేటీ.. అభివృద్ధి పనులపై సవివర చర్చ



**సత్తుపల్లి, సెప్టెంబరు 16:మహా :** సత్తుపల్లి మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి టీ.కె. శ్రీదేవి, ప్రభుత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టియానచౌట్‌లతో ఎమ్మెల్యే సమావేశమై సత్తుపల్లి పట్టణంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సవివరంగా చర్చించారు. పట్టణ ప్రజల అవసరాలు, మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, పారిశుధ్యం, తాగునీరు తదితర అంశాలపై అధికారులకు వివరించారు. సత్తుపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే కోరారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే రాగమయి చొరవతో పట్టణ అభివృద్ధి అంశాలు ఉన్నతస్థాయిలో చర్చకు రావడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కమల్ పాషా, రిహానా బేగం తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కుల పరిరక్షణకు పోరాటం

**జూలూరుపాడు, మహా:** గిరిజనుల రాజ్యాంగ హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి భూక్యా వీరభద్రం విమర్శించారు. బుధవారం కంగాల బుచ్చయ్య భవన్‌లో బానోతు ఈశ్వర్ నాయక్ అధ్యక్షతన జరిగిన సంఘం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. గిరిజనులను వారి భూముల నుంచి దూరం చేసి కార్పొరేట్ సంస్థలకు భూములు అప్పగించే విధానాలను వ్యతిరేకించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, చేవెళ్ల డిక్లరేషన్‌ను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. తండాలను గ్రామ పంచాయతీలుగా గుర్తించడం, పోడు భూములకు హక్కు పత్రాలు అందించడం కోసం సంఘం గతంలో అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గిరిజన వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ వాంకుడోత్ అమర్‌సింగ్ నాయక్ మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారానికి భవిష్యత్ ఉద్యమాల్లో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ నెల 20న లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డులో జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కే.కే-5 గనిలో ప్రమాదం

**మందమర్రి, మహా:** మందమర్రి ఏరియాలోని కే.కే5 బొగ్గు గనిలో బుధవారం మొదటి షిఫ్ట్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు కార్మికులకు గాయాలయ్యాయి. కోల్ కట్టర్ రాజశేఖర్, జనరల్ అసిస్టెంట్లు ఆవునూరి శశికుమార్, రామిల్ల తిరుపతిని గని నుంచి బయటకు తీసుకొచ్చి రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కార్మికుల వివరాల ప్రకారం గనిలో జరిగిన ఎయిర్ బ్లాస్ట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద విషయం తెలుసుకున్న సీఐటీయూ కార్యదర్శి ఎస్. వెంకటస్వామి యూనియన్ నాయకులతో కలిసి గాయపడిన కార్మికులను పరామర్శించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. భూగర్భ గనుల్లో భద్రతా చర్యలపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని కోరారు. ఒకే వారంలో రెండుసార్లు ప్రమాదాలు జరగడం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోందన్నారు. బ్లాస్టింగ్ అనంతరం పైకప్పు పరిస్థితిని సూపర్‌వైజర్లు పూర్తిగా పరిశీలించిన తర్వాతే పనులు ప్రారంభించాలని సూచించారు. అవసరమైన భద్రతా పరికరాలను యాజమాన్యం అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సేఫ్టీ, మైన్స్ కమిటీల్లో సీనియర్ కార్మికుల సూచనలను తీసుకోవాలని, ఉత్పత్తి కంటే కార్మికుల రక్షణకే ప్రాధాన్యత ఇవ్వాలని వెంకటస్వామి కోరారు.

# తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు

- **ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించిన సిపిఐ**
- **అమరవీరుల త్యాగాలను ప్రభుత్వం అధికారికంగా గుర్తించాలి**
- **సిపిఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహా**



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 16 మహా:** సిపిఐ మండల కార్యదర్శి కావలి సురేష్ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలకు ముఖ్యఅతిథిగా హాజరైన సిపిఐ రాష్ట్ర నాయకులు కావలి నర్సింహా పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటం నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా రైతాంగం సాగించిన చారిత్రాత్మక పోరాటమని గుర్తు చేశారు. రైతులు, కూలీలు, పేద ప్రజలు తమ హక్కుల కోసం ఎర్రజెండా నాయకత్వంలో సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చెరగని ముద్ర వేసిందని పేర్కొన్నారు. వేలాది మంది పోరాట యోధులు తమ ప్రాణాలను త్యాగం చేసి భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడారని తెలిపారు. సాయుధ పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు. చరిత్రను వక్రీకరించకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని, తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు ప్రభుత్వం అధికారికంగా జోహార్లు అర్పించాలని డిమాండ్ చేశారు.ప్రతి సంవత్సరం ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను నిర్వహించి, పోరాట యోధుల త్యాగాలను స్మరించుకోవాలని కోరారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సహాయ కార్యదర్శి శివరాల సూర్యం, జిల్లా నాయకులు పోచమోని నీలమ్మ, శివరాల యాదగిరి, శివరాల లక్ష్మయ్య, ములుగు నర్సింహా, జంగిలి నర్సింహా, సీతయ్య, కట్టెల మారయ్య, బండ నర్సింహా, అశోక్, లక్మయ్య యాదగిరి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# "మీకు లెక్కలు అడిగే అర్హత లేద"న్న గ్రామ కార్యదర్శులు..!

**యాచారం సెప్టెంబర్ 16 మహా:** వార్డు మెంబర్ల సమస్యల పరిష్కరించాలని ఎంపీడీవోకు, యాచారం మండలం వార్డు మెంబర్ల ఫోరం ఆధ్వర్యంలో వినతి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో ప్రజలచే ఎన్నుకోబడిన వార్డు మెంబర్లను గ్రామ కార్యదర్శులు చులకనగా చూస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. అభివృద్ధి వివరాలు, నిధుల ఖర్చుల లెక్కలను అడిగే సంపూర్ణ హక్కు వార్డు మెంబర్లకు ఉందని ఆయన స్పష్టం చేశారు. వార్డు సభ్యులు కూడా ప్రజాప్రతినిధులేనని అభివృద్ధి పనులు, వాటి లెక్కలు అడిగే అధికార చట్టబద్ధత వారికి ఉందన్నారు. లెక్కలు చూపించమని అడిగితే "మీకు అడిగే అర్హత లేదని గ్రామ కార్యదర్శులు వార్డు మెంబర్లను బెదిరించడం అహంకారపూరిత చర్య అన్నారు. ప్రజాధనం ఏ విధంగా ఖర్చవుతుందో తెలిపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. గ్రామ పంచాయతీల కార్యదర్శులు తమ వైఖరిని మార్చుకుని, వార్డు మెంబర్లకు తగిన గౌరవం ఇవ్వాలన్నారు. వినతి అందజేసిన వారిలో పలువురు వార్డు సభ్యులు మహేష్, సంజీవరెడ్డి, రామకృష్ణ, పోలే శివ, కంబాలపల్లి కుమార్, కొండ్రెడ్డి రాజు, వినోద్ తదితరులు ఉన్నారు.

## వృద్ధ మహిళ అదృశ్యం

**వలిగొండ, సెప్టెంబర్ 16మహా న్యూస్:** వృద్ధ మహిళ అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన ఊదరి నర్సమ్మ (76) ఈ నెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లిన అనంతరం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలతో పాటు బంధువుల ఇళ్లలో గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి బుధవారం తెలిపారు. నర్సమ్మ ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది నెంబర్లకు 8712662484, 8712662810 సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

# కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ

( మొదటి పేజీ తరువాయి )

(ఎస్ఈటీ) వేసి మొత్తం భూకుంభకోణంపై నెలరోజుల్లో నిగ్గు తేలుస్తామని స్పష్టం చేశారు. ఇప్పటివరకు చెప్పింది ధరణి పార్ట్ 1 మాత్రమేనని, త్వరలోనే ధరణి పార్ట్2 అక్రమాలు బయటపెడతామని వెల్లడిచారు. బీఆర్ఎస్ సభ్యులు సభలో ఉన్నప్పుడే అన్నీ బయటపెడతామని తెలిపారు. ఈసారి సమావేశాలకు బీఆర్ఎస్ సభ్యులు వచ్చేలా స్పీకర్ చూడాలని కోరారు. తన కళ్లల్లోకి చూసి మాట్లాడే ధైర్యం వాళ్లకు ఉండదని, టీజీఐఐసీ భూముల్లో జరిగిన అక్రమాలను బడ్జెట్ సెషన్‌లో బయటపెడతామని స్పష్టం చేశారు. సత్యం రామలింగరాజు ఆస్తులను కేటీఆర్ తీసుకున్నారన్న సీఎం హైకోర్టులో వివాదంలో ఉన్న సత్యం రామలింగ రాజు భూమి కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని తెలిపారు. జన్వాడలో సర్వే నం.311లో ఇన్‌కంటాక్స్ సీజ్ చేసిన భూమి కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని అన్నారు. ఐటీ అటాచ్ చేసిన భూమి శతభిష కంపెనీ నుంచి బదిలీ అయ్యిందని, 2015లోకి ఆచంట మల్లన్న చేతుల మీదుగా కేటీఆర్‌కు బదిలీ అయ్యిందని, శతభిష ఆగ్రో ప్రైవేటు లిమిటెడ్ అనేది సత్యం రామలింగరాజుకు సంబంధించిందని, 2019లో ధరణి కాంట్రాక్టు కట్టబెడితే జన్వాడ భూములు బదిలీ అయ్యాయని పేర్కొన్నారు.

**రంగనాయక్ సాగర్ లో హరీష్ కు భూములు**

హరీశ్‌రావుకు రంగనాయకసాగర్ పరిధిలో భూమి ఉందని, రంగనాయకసాగర్ ప్రాంతంలో హరీశ్‌రావు భూమి కొన్నారని రేవంత్ రెడ్డి తెలిపారు. రిజర్వాయర్ కోసం ఇరిగేషన్ శాఖ భూసేకరణ చేసిందని, హరీశ్‌రావు కొన్న భూమిని భూసేకరణ జాబితాలోంచి తర్వాత తొలగించారని, రామంచ సర్వే నం.4.20 ఎకరాలకు గాను ఒక ఎకరం తీసుకున్నారని పేర్కొన్నారు. భూసేకరణ రైతలకు ఎకరాకు రూ.6.20 లక్షల చొప్పున చెల్లించిందని, హరీశ్‌రావు మాత్రం రైతుల నుంచి రూ.2.50 లక్షల చొప్పున కొనుగోలు చేసినట్లు రికార్డులు ఉన్నాయని, రంగనాయకసాగర్ ఫామ్‌హౌస్‌కు రూ.5.33 కోట్లతో బీటీ రోడ్డు వేయించుకున్నారని, సిద్దిపేట మున్సిపాలిటీ నిధులతో టెండర్లు కూడా లేకుండా రోడ్డు వేయించుకున్నారని వెల్లడించారు. ధరణిని అడ్డుపెట్టుకుని హరీశ్‌రావు మామ, సోదరుడు 94 ఎకరాల భూమిని కొల్లగొట్టారని, హరీశ్‌రావు మామ కూడా 93.33 ఎకరాల భూమిని గౌరవ్ పురానా పేరు ఉంటే ఎం.హనుమంతరావు పేరు మీదకు మార్చారని సీఎం ఆరోపించారు. 2022లో రాజ్ హైటెక్ ఫామ్ లిమిటెడ్ మీదకు మార్చుకున్నారని, రాజ్ హైటెక్ ఫామ్ లిమిటెడ్‌లో హనుమంతరావు, హరీశ్‌రావు తమ్ముడు మహేశ్‌రావు భాగస్వాములని తెలిపారు.



**కేసీఆర్ విచారణకు అడుగుతారా?**

జగదీశ్‌రెడ్డి 50 ఎకరాల ఫామ్‌హౌస్‌లో 11.5 ఎకరాల ఇనాం భూమి ఎలా వచ్చిందని నిలదీశారు. పైలట్ రోహిత్‌రెడ్డి అజీజ్‌నగర్‌లో అసైన్డ్ భూమిలో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి , సుధీర్‌రెడ్డి 650 ఎకరాల ప్రభుత్వ భూమి కొనుగోలు చేశారని అన్నారు.

కిషన్‌రెడ్డి సొంతూరు తిమ్మాపూర్‌లో 77 ఎకరాల భూదాన్ భూమి ప్రైవేటుపరమైందని, దామోదర్‌రావుకు గోల్డ్‌స్టోన్ ప్రసాద్ బెంజి కారు ఇచ్చారని తెలిపారు. దామోదర్‌రావుకు బెంజికారు ఎందుకు ఇచ్చారో కేసీఆర్ విచారణకు అడుగుతారా? ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్సీ మల్కం కొమురయ్య 10 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా చేశారని ఆరోపించారు.

**రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారింది**

భూముల సమస్య వారసత్వంగా ఎలా వచ్చిందనే దానిపై చర్చ చేపట్టాలని, నిజాం సర్కారు, ఉమ్మడి రాష్ట్రంలో సమస్యలపై చర్చ చేపట్టాలని, తెలంగాణ ఏర్పాటు, 22ఏ జాబితా సమస్యలు, కోర్టు తీర్పులు అంశాలపై చర్చ చేపట్టాలని రేవంత్ రెడ్డి కోరారు. కొందరు కొల్లగొట్టిన వేల ఎకరాల వివరాలను సభ ముందుంచుతామని స్పష్టం చేశారు. ధరణి పేరిట దోపిడీ రూ.లక్షల కోట్ల ఆస్తి కొందరి చేతుల్లోకి మారిందని, నిషేధిత భూముల సమస్యను మరింత జఠిలం చేశారని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సృష్టించిన భూతం అందరినీ మింగేస్తుందని తప్పుడు ప్రచారం చేశారని, పొంగులేటిపై కక్షాపూరిత ఆలోచనతో అబద్ధాలు ప్రచారాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలకు శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వం కారణం కాదని, శ్రీనివాస్‌రెడ్డిది ఎంత బాధ్యతో ప్రభుత్వానిది అంతే బాధ్యతని తెలిపారు. వారసత్వ సమస్యలపై చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

**ఎకరాలు గజాలుగా మారినపుడు భూమి తగ్గిపోయింది**

నిజాం సర్కారు హయాంలో 60 శాతం దివానీ భూములేనని, 60 శాతం భూముల్లో ఆదాయం ప్రభుత్వం తీసుకుని అభివృద్ధికి వాడేదని, నిజాం హయాంలో 40 శాతం భూములు నాన్ దివానీ కింద ఉండేవని సీఎం తెలిపారు. 40 శాతం భూముల్లో వచ్చే ఆదాయాన్ని నిజాం కుటుంబానికి వాడుకున్నారని, అద్భుత పాలన అందించిన గొప్ప రాజనీతిజ్ఞుడు నిజాం సర్కారని కొనియాడారు. నిజాం వద్ద ఉన్న 40 శాతం భూములు జాగీర్దార్లు, సర్ఫేఖాస్ వద్ద ఉండేవని, నిజాం సర్కారు 60 శాతం భూములను కొలిచి హద్దులు నిర్ణయించారని పేర్కొన్నారు. నిజాం అధీనంలో ఉన్న 40 శాతం భూములు ఎన్ని అనేది సరిగా తెలియదని, ఎకరాలు గజాలుగా మారినపుడు భూమి తగ్గిపోయిందని, ప్రభుత్వ భూముల నుంచి ప్రైవేటుకు మారడం వల్ల సమస్యలని, 1948 నుంచి 1954 వరకు భూముల వివరాలు నమోదు చేశారని వెల్లడించారు. ఆరేళ్లపాటు వివరాలు నమోదు చేసి చసాల్ పహానీ రూపొందించారని, ఇప్పటికీ మనకు ఉన్న అధికారిక రికార్డులు కాస్రా పహానీయేనని, కాస్రా పహానీలో అనుమానం వస్తే చసాల్ పహానీ వెతుకుతారని పేర్కొన్నారు.

**మహిళలను కించపరిచేలా వ్యవహరించారు**

పార్లమెంటు నిబంధనలను స్పీకర్ అమలు చేస్తున్నారని, నినాదాల దుస్తులతో రాకూడదని స్పీకర్ ఆదేశిస్తే ఎవరూ రాకూడదని, రాహుల్, ప్రియాంక, ఖర్గే ఎవరైనా స్పీకర్ ఆదేశాలు పాటించాల్సిందేనని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. అసెంబ్లీ నిబంధనల మేరకు సభను స్పీకర్ నిర్వహిస్తారని, నిబంధనలు లేకపోతే పార్లమెంటు నిర్వహణను అనుసరిస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ వద్ద పోలీసులు, మహిళలను కించపరిచేలా వ్యవహరించారని, అర్ధనగ్న ప్రదర్శనలతో పోలీసులను దూషించారని, సభ అధ్యక్షుడిపై కూడా అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. సభ్యులు క్షమాపణ చెప్పి లేవనెత్తిన అంశాలపై చర్చిస్తారని స్పీకర్ మైకు ఇచ్చారని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సభ్యులను సమావేశాల నుంచి బహిష్కరించారని తెలిపారు.

# ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా తిరుమల

**తిరుమల,మహా :** తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచ స్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహించే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. 6 డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు.



గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సులభంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజియాన్ని సిద్ధం చేసింది. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజియాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరించే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను ముఖ్యమంత్రి తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజియంలో సీఎం ఆసక్తిగా పరిశీలించారు.

తిరుమలలో భక్తుల కోసం 32 ఎలక్ట్రిక్ బస్సులు

తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేషన్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈమోబిలిటీ సీఈఓ నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు. తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని సీఎం తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణిస్తే రూ.2 లక్షల ఆర్థిక సాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి సేవకులను విద్య, వైద్య రంగాల్లోనూ వినియోగించుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆరు అంశాల్లో తిరుమల తిరుపతి దేవస్థాన కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# నెల్లూరులో లోకేష్ ఆధునీకరించిన పాఠశాలల ప్రారంభం

**వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.8.3 కోట్ల నిధులతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి**

**నెల్లూరు, మహా :** కార్పొరేట్ హంగులతో నెల్లూరులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసి కార్పొరేట్ స్కూళ్లను తలపించేలా సకల సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. నెల్లూరు నగరంలో మొత్తం 15 ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే వీఆర్ సీ స్కూల్ ను ఆధునీకరించడం జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం నెల్లూరు పట్టణం స్టోన్ హౌస్ పేటలో ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ మున్సిపల్ కార్పోరేషన్ హైస్కూల్ ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నెల్లూరు ఎంపీ, వీపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆధునీకరించిన ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల భవనాలను రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. అనంతరం పాఠశాల మొత్తం కలియతిరిగి తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాల్ ను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరాతీశారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

**రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి**

వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ ను అభివృద్ధి చేయడం జరిగింది. రెండు అంతస్థుల్లో భారీ నిర్మాణంతో 43 తరగతి గదులు అందుబాటులోకి తీసుకువచ్చారు. విద్యార్థులకు డిజిటల్ బోధన అందించేందుకు ఎల్ఈడీ స్క్రీన్ లు, అధునాతన బెంచీలను ఏర్పాటుచేశారు. పాఠ్యపుస్తకాలకే విద్యను పరిమితం చేయకుండా ప్రయోగాత్మక, సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్, లాంగ్వేజ్ రూమ్‌లు తదితర ప్రత్యేక వసతులను కల్పించడం జరిగింది. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ మోడ్రన్ టాయిలెట్లను ఏర్పాటుచేశారు.



**విశాలమైన క్రీడా ప్రాంగణం అభివృద్ధి**

చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలనే లక్ష్యంతో పాఠశాలలో విశాలమైన క్రీడా ప్రాంగణాన్ని అభివృద్ధి చేయడం జరిగింది. ఎకరా స్థలంలో ప్లేగ్రౌండ్ ఏర్పాటుచేయడంతో పాటు ఫుట్ బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులు సిద్ధం చేశారు. అదనంగా కిడ్స్ ప్లే ఏరియా, సెన్సరీ పార్క్, అవుట్ డోర్ జిమ్ వంటి ఆధునిక సదుపాయాలను కల్పించారు. సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టు ఏర్పాటుచేశారు.

**ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఆధునిక సదుపాయాల కల్పన**

నర్సరీ నుంచి పదో తరగతి వరకు విద్యాబోధనకు అనువుగా పాఠశాలను తీర్చిదిద్దడం జరిగింది. ఒకే ప్రాంగణంలో పాఠశాల విద్యకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్‌లు, గ్రంథాలయం, కళలు, క్రీడలు, డిజిటల్ విద్య తదితర సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులతో సమానంగా ఆధునిక సదుపాయాలను వినియోగించుకోవాలన్న లక్ష్యంతో ఈ విద్యాయజ్ఞాన్ని మంత్రి లోకేష్ ముందుకు తీసుకెళ్తున్నారు. ఆధునీకరించిన పాఠశాలను ప్రారంభించిన అనంతరం పాఠశాల పనితీరుపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.ప్రసాద్, ఇతర అధికారులతో మంత్రి సమీక్షించారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో స్కూల్ వెనుకబడి ఉందని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గతేడాది పదో తరగతిలో 60.19 శాతం ఉత్తీర్ణత సాధించారని, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంపుపై దృష్టిసారించాలన్నారు. స్టూడెంట్ ఎన్ రోల్ మెంట్ కూడా తగ్గిందని, ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపైనా మంత్రి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, మంత్రి పి. నారాయణ, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 10 నుంచి 22 వరకు దసరా సెలవులు

**ఖరారుచేసిన తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలోని పాఠశాల విద్యార్థులకు విద్యార్థులకు ముఖ్యమైన అప్‌డేట్. రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సంబంధించి సమ్మేటివ్ అసెస్‌మెంట్ 1 పరీక్షల షెడ్యూల్‌తో పాటు దసరా సెలవులను విద్యాశాఖ వెల్లడించింది. దీని ప్రకారం, అక్టోబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఎస్ ఏ 1 పరీక్షలు జరగనున్నాయి. అనంతరం అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. పరీక్షల నిర్వహణలో సౌలభ్యం కోసం తరగతుల వారీగా వేర్వేరు సమయాలను కేటాయించారు.

పరీక్షల సమయాల వివరాలు ఇలా ఉన్నాయి:

1 నుంచి 5వ తరగతి వరకు: విద్యార్థులకు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు

6, 8వ తరగతులకు: ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు

7వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు

9వ తరగతికి మధ్యాహ్నం 1:15 నుంచి సాయంత్రం 4:15 గంటల వరకు

10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9:15 నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

కాగా, తరగతుల వారీగా ఆయా సబ్జెక్టుల పరీక్ష తేదీలతో కూడిన పూర్తి స్థాయి కూడిన టైమ్ టేబుల్ ఇప్పటికే అందుబాటులోకి వచ్చింది. ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు, ఉపాధ్యాయులు పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యాశాఖ సూచించింది.

## అందరి భూములపై సీబీఐ విచారణ జరగాలి

- **గుంటనక్క.. గూఢచారిలను విచారిస్తారన్న నమ్మకం లేదు**
- **కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్**

**హైదరాబాద్, మహా :** సీఎం అసెంబ్లీలో ఎవరెవరికి అక్రమ భూములు ఉన్నట్టు చెప్పారో వారందరిపై సరైన విచారణ జరిపిస్తారన్న నమ్మకం తనకు లేదని టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. అసెంబ్లీలో సీఎం చదివిన భూముల చిట్టాలో నిజాలు నిగ్గు తేలాలంటే సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. "సీఎం ఈ రోజు అసెంబ్లీలో ప్రస్తావించిన గుంట నక్క, కేసీఆర్ ఫామ్ హౌస్ లో ఉండే సీఎం గూఢచారి సహా నవీన్ రావు, కొండల్ రావు, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, జగదీశ్ రెడ్డి, రామేశ్వర్ రావు, ప్రతిమ శ్రీనివాస్ రావు, పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి సహా అందరి భూములపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి నిజాలు నిగ్గు తేల్చాలి" అని డిమాండ్ చేశారు. తాను ఎప్పటి నుంచో చెప్తున్నట్టుగా గుంపు మేస్త్రీ గుంటనక్క కలిసే ఉన్నారని మరోసారి స్పష్టం చేశారు. వారిద్దరూ కలిసే ఈ డ్రామాలు చేస్తున్నారని కవిత మండిపడ్డారు. నిబంధనలు అతిక్రమించి తనకు గజం భూమి ఎక్కువగా ఉన్నా.. ఎన్నికల అఫిడవిట్ లో పేర్కొన్న భూమి కన్నా గజం అదనంగా ఉన్నట్టు తేలినా ఆ భూములు ప్రభుత్వానికి సరెండర్ చేస్తానని మరోసారి స్పష్టం చేస్తున్నానని కుండ బద్దలు కొట్టారు.

## మహిళల భద్రతే మా ప్రధాన లక్ష్యం

**అడిషనల్ డీసీపీ క్రైమ్స్ బాలస్వామి చే షీ టీమ్ గురించి విద్యార్థులకు అవగాహన**

**హనుమకొండ, మహా ;** నేరాలు, మహిళల పై పెరుగుతున్న అఘాయిత్యాలు నేటి కాలంలో నేరాల అదుపులో అందరూ భాగస్వామ్యం కావాలని తమవంతు బాధ్యతలను నిర్వర్తించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల మహిళల మీద జరిగే నేరాలను అదుపు చేయవచ్చని వరంగల్ అడిషనల్ డీసీపీ బాలస్వామి అన్నారు. హనుమకొండ లోని తాళ్ల పద్మవతి ఇంజనీర్ కాలేజీ లో విద్యార్థి, విద్యార్థినిలతో సైబర్ నేరాలు, మహిళలపై జరిగే అత్యాచారాలు, మహిళల పై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు. ఈ సందర్భంగా వరంగల్ అడిషనల్ డీసీపీ బాలస్వామి, ఏసీపీ సదయ్య మాట్లాడుతూ అమ్మాయిలు ఫేస్ బుక్, ఇన్ స్టా గ్రామ్, స్నాప్ చాట్, టెలిగ్రామ్ లాంటి సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలు పంచు కోవడంలో జాగ్రత్త వహించాలని, సైబర్ నేరాల పై,అవగహన కలిగివుండాలని, అలాగే మహిళలు ఒంటరిగా తెలియని ప్రదేశాలకు ప్రయాణం చేయవలసి వచ్చినప్పుడు అందరు టీసేఫ్ ఆప్ ను ఉపయోగించుకోవాలని, టీసేఫ్* ఆప్ పై అవగాహన కలిగి ఉండాలని, ఉద్యోగాలు చేసే మహిళలకు తాము పనిచేసే ప్రదేశాలలో అసభ్యకరంగా ప్రవర్తించే వారి పట్ల, ఆకతాయుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వారితో తమ వ్యక్తిగత విషయాలు పంచు కోరాదని సూచించారు.

ANN తెలుగు
# మహా పత్రిక
04
గురువారం, హైదరాబాద్ | 17-09-2026
సంపాదకీయం | EDITOR IAL
WWW.MAHAADAILY.COM




## 'సేవా సంకల్ప్ అభియాన్'తో రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు

**అమరావతి,మహా :** ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి అక్టోబరు 17 వరకు నెల రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ఈ శిబిరాల్లో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు, కార్యక్రమాలపై అవగాహన కల్పించనున్నారు. 'స్వర్ణ భారత్-స్వర్ణ ఆంధ్రప్రదేశ్-2047' లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను చేపడుతున్నామని భాజపా జాతీయ నాయకుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా ఈ వైద్య శిబిరాలు జరగనున్నాయి

**వైద్య సేవలతో పాటు పథకాలపై అవగాహన**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు. ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాల వివరాలను తెలియజేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఆరోగ్య పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను మంత్రి ఆదేశించారు. పార్టీ అధిష్టానం ఆదేశాలు అనుసరించి సేవా సంకల్ప అభియాన్ ద్వారా దక్షిణాదిన జరిగే కార్యకలాపాలను భాజపా తరపున మంత్రి సత్య కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

**ప్రత్యేక కమిటీ ఏర్పాటు**

వైద్య శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ చక్రధర్‌బాబు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. శిబిరాల ప్రణాళిక, సమన్వయం, అమలు, పర్యవేక్షణ బాధ్యతలను ఈ కమిటీ చేపట్టనుంది. జిల్లా వారీగా శిబిరాల తేదీలు, ప్రాంతాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలు, అందించాల్సిన వైద్య సేవలను ఖరారు చేయనుంది. శిబిరాలకు హాజరయ్యే వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. అందించిన వైద్య సేవలు, రోగుల వివరాలను కమిటీ పర్యవేక్షించనుంది. అవసరమైన చోట అధికారులకు సలహాలు, సూచనలు అందించనుంది. శిబిరాలు పూర్తయిన అనంతరం జిల్లాల వారీగా నిర్వహించిన కార్యక్రమాలు, లబ్ధిదారుల వివరాలతో సమగ్ర నివేదిక రూపొందించనున్నారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ "'సేవా సంకల్ప్ అభియాన్' ద్వారా ప్రజలకు అవసరమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలి. ప్రతి జిల్లాలో అధికారులు సమన్వయంతో పనిచేసి శిబిరాలను విజయవంతం చేయాలి.



# ఆదివాసీ ఆహార వైభవం

- **చిరుధాన్యాల వినియోగంతో రోగనిరోధక శక్తి మెరుగు**
- **సాంప్రదాయ ఆహార అలవాట్లే రక్ష**
- **సదస్సులో కలెక్టర్ వెల్లడి**

ఆదిలాబాద్ మహా : ఆదివాసీల సాంప్రదాయ ఆహార అలవాట్లు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులే సమాజ ఆరోగ్యానికి నిజమైన రక్ష అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. బుధవారం సిరికొండ మండలం నారాయణపూర్‌లో ఆర్‌పీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆదివాసీ ఆహార వైభవం' సదస్సుకు ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆదివాసీల సాంప్రదాయ ఆహార అలవాట్లు, ప్రకృతి వ్యవసాయ పద్ధతులే సమాజ ఆరోగ్యానికి నిజమైన రక్ష అని, నేటి ఆధునిక జీవనశైలిలో తలెత్తుతున్న పలు అనారోగ్య సమస్యలను అధిగమించాలంటే మళ్లీ సంప్రదాయ ఆహార విధానాల వైపు మళ్లక తప్పదని అన్నారు. మన పూర్వీకులు అందించిన సహజసిద్ధమైన ఆహార ధాన్యాలు, చిరుధాన్యాల వినియోగంతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సుస్థిర భవిష్యత్తు కోసం పర్యావరణహిత సేంద్రీయ సాగును, మిల్లెట్ల ఉత్పత్తిని పెద్దఎత్తున ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల విలక్షణ జీవన సంస్కృతిని, బలవర్ధక ఆహారాన్ని బాహ్య ప్రపంచానికి పరిచయం చేస్తూ, గిరిజనుల ఆర్థిక పురోభివృద్ధికి కృషి చేస్తున్న ఆర్‌పీజీ ఫౌండేషన్ బృందాన్ని కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని అరికట్టేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'ఫుడ్ ఫెస్టివల్' స్టాల్ లను కలెక్టర్ సందర్శించి, స్థానిక చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలతో రూపొందించిన పోషకాలతో కూడిన వంటకాల వివరాలను ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేసి, మొక్కను నాటి నీరు పోశారు .ఈ కార్యక్రమంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, ఉద్యానవన శాఖ అధికారి సందీప్ కుమార్, ఆర్‌పీజీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకర్‌రెడ్డి, తెలంగాణ ప్రోగ్రామ్ అధికారి జి.రవికుమార్, స్థానిక సర్పంచ్ విమలాబాయి, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పరిసర గ్రామాల రైతులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# చరిత్రను వక్రీకరిస్తే చూస్తూ సహించేది లేదు : సిపిఎం

**వలిగొండ సెప్టెంబర్ 16 మహా న్యూస్ :** కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన వీరోచిత సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరిస్తే సహించేది లేదని బిజెపి మత ఉన్మాద విధానాలను మానుకోవాలి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు అన్నారు. బుధవారం సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా పహిల్వాన్ పురం,రెడ్ల రేపాక, మొగిలిపాక గ్రామాల్లో నాటి పోరాట అమరుల స్థూపాల వద్ద పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జరిగిన సభల్లో వారు మాట్లాడుతూ నాడు తెలంగాణ ప్రాంతంలో భూమి,భుక్తి,విముక్తి కోసం,దొరల దోపిడీ దారుల నుండి స్వేచ్ఛ, సమానత్వం కోసం జరిగిన మహోన్నత పోరాటమన్నారు చరితతో ఎలాంటి సంబంధం లేని బిజెపి నాటి చరిత్రను వక్రీకరిస్తుందని చరితను వక్రీకరిస్తే సహించేది లేదన్నారు . ఈ పోరాటంలో కులం,మతం సంబంధం లేకుండా నైజాం రజాకార్లకు తాబేదార్లుగా ఉన్న భూస్వాముల,పటేల్ పట్వారీల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పేదలపై వేసిన నిర్బంధపు వెట్టిచాకిరికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున మహా ఉద్యమం జరిగిందన్నారు దీనిలో వివిధ వృత్తులకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని గుర్తుచేశారు ఈ పోరాటంలో 4వేల మంది అమరులయ్యారని 10 లక్షల ఎకరాల భూమిని కమ్యూనిస్టులు స్వాధీనం చేసుకుని పేదలకు పంచారని అన్నారు, విసునూరు రామచంద్రారెడ్డి, జన్నారెడ్డి ప్రతాప్ రెడ్డి,విఠల్ రావు లాంటి భూస్వాములు హిందువులే కదా? వీరు నైజాం ఏజెంట్లు కదా? అని ప్రశ్నించారు. బిజెపి మతోన్మాదంను రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలని చూసే కుట్రలను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతంలో పులిగిల్ల, సుంకిశాల,మొగిలిపాక, పహిల్వాన్ పురం,రెడ్ల రేపాక లాంటి అనేక గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున ఈ ఉద్యమంలో పాల్గొన్నారని వారి యొక్క స్ఫూర్తి చైతన్యాన్ని ముందుకు తీసుకుపోయేందుకు ప్రజలంతా కమ్యూనిస్టులు చేస్తున్న ప్రజా పోరాటాల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు నాడు కమ్యూనిస్టులు చేసిన పోరాటాల ద్వారా నేటికీ పాలకులు భూమి పంపకమనే మాటను వీడడం లేదని వారి యొక్క పోరాట స్ఫూర్తి నేటికి కొనసాగుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు చీర్క శ్రీశైలం రెడ్డి,కల్కూరి రాంచందర్, మొగిలిపాక గోపాల్, కొండె క్రిష్టయ్య,కవిడే సురేష్,బూడిద మనమ్మ, నాయకులు గర్దాసు నరసింహ,కొండూరు సత్తయ్య,శీలం ఇందిర,వేముల నాగరాజు,కొమ్ము స్వామి, దేశపాక రవి,ఏటెల్లి నరసింహ,గుండెపురి నరసింహ,జక్క రాఘవరెడ్డి,రేపాక ముత్యాలు,చీర్క లక్ష్మమ్మ,బందారపు ధనంజయ,మైసొల్ల నరేందర్, సంగి శ్రీనివాస్, వట్టిపల్లి చంద్రయ్య, పాల్గొన్నారు...




# రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ

- **గంజాయి అక్రమ రవాణా పై నిఘా**
- **శాంతి భద్రతల పై ప్రత్యేక శ్రద్ధ**
- **సీపీ అంబర్ కిషోర్ ఝా**

**క్యాతలపల్లి మహా :** వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. మందమర్రి సిఐ పర్శ రమేష్, రామకృష్ణాపూర్ పట్టణ ఎస్ఐ జాడి శ్రీధర్ లు పూల మొక్కతో స్వాగతించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించి, పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. అనంతరం స్టేషన్ పరిసరాలు, రికార్డులు, రిసెప్షన్ కేంద్రం, సీసీటీఎన్ఎస్, వాహనాల నిర్వహణను పరిశీలించారు. పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణ, పెట్రోలింగ్, రౌడీషీటర్లు, విజిబుల్ పోలీసింగ్‌పై ఎస్ఐ శ్రీధర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఫిర్యాదులను మానవీయ దృక్పథంతో స్వీకరించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. హైవే, రైల్వే స్టేషన్, కాలనీలలో శాంతిభద్రతలు, మహిళలు, వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెంచాలని, సీసీ కెమెరాల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ విషయంలో సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లో అయోమయం

- **నాలుగు ముక్కలైన హస్తం పార్టీ**
- **కార్పొరేషన్ ఎన్నికల వేళ తెరలేపిన వర్గపోరు**
- **టికెట్ల కోసం నాలుగు గ్రూపుల లాబీయింగ్**
- **హైకమాండ్ కు తలనొప్పిగా మారిన తూర్పు నియోజకవర్గం**

**వరంగల్, బ్యూరో మహా ;** గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ, వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీలో అయోమయం నెలకొంది. ఒకప్పుడు ఏకతాటి పై ఉన్న కాంగ్రెస్, ఇప్పుడు స్పష్టంగా నాలుగు వర్గాలుగా చీలిపోయింది. దీంతో సీనియర్ నాయకులు, ముఖ్య నాయకులు కార్యకర్తలు ఎటు వెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

నాలుగు వర్గాలు నాలుగు లెక్కలు

**మొదటి వర్గం - కొండా సురేఖ వర్గం**

ప్రస్తుత మాజీ మంత్రి, తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖదే ఇక్కడ పట్టు. కొండా మురళి బలంతో తూర్పులో తమదే హవా అని ఈ వర్గం చెబుతోంది. కార్పొరేషన్ లో ఎక్కువ డివిజన్లలో తమ అనుచరులకే టికెట్లు కావాలని పట్టుబడుతున్నారు. ప్రస్తుతం ఇప్పుడు సీన్ మారింది, కొండా వర్గం స్వయంకృప అపరాధమో, వారి గెలుపు కోసం కష్టపడ్డ వారి ఉసురో తెలియదు గానీ ఇటీవల అధిష్టానం మంత్రివర్గం నుండి కొండా సురేఖ ను బర్తరఫ్ చేయడంతో సొంత నియోజకవర్గంలోనే వారి క్యాడర్ కాస్త అయోమయంలో పడ్డారు. కొండా కుటుంబం తూర్పు నియోజకవర్గం మాదే కార్పొరేషన్ లోని 24 డివిజన్ల సీట్లన్నీ గెలిపిస్తాం అని ఎంత గాంభీర్యం తో బయటికి చెప్తున్నారు కానీ గత ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి తూర్పు నియోజకవర్గం నుండి అతి తక్కువ ఓట్లు పోల్ అవ్వడంతో అధిష్టానానికి ఈ తూర్పు నియోజకవర్గం తలనొప్పిగా మారింది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి కొండా కుటుంబం సొంత పార్టీ నేతల పైనే చేస్తున్న వ్యాఖ్యలు స్వపక్షంలోనే విపక్షంలా అవి కాస్త తెలంగాణ కాంగ్రెస్ కు తలనొప్పిగా మారాయని చెప్పవచ్చు. కొండా సురేఖ ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయడం వల్ల ఎటువంటి నష్టం లేదని తూర్పు కాంగ్రెస్ లో మిగతా మూడు వర్గాలు చెప్పకనే చెబుతున్నాయి. కాగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కొండా దంపతులను నమ్ముకుని బిఆర్ఎస్ నుండి వచ్చిన జంప్ జిలానీలు, మాజీ కార్పొరేటర్లు, టికెట్లు ఆశిస్తున్న ఆశావాహుల పరిస్థితి ఇప్పుడు అయోమయ గోచరంగా మారింది. కానీ ఇక్కడే ఒక పెద్ద ట్విస్ట్ దాగి ఉంది, కొండా దంపతుల తోనే మేం ఉన్నామని కొంతమంది చెప్పుకుంటూనే మిగతా మూడు వర్గాలతో రహస్య భేటీ లతో పాటు ఎప్పటికప్పుడు ఫోన్ టచ్ లో ఉంటూ టిక్కెట్ల కోసం కాపు కాచి ఉన్నారని తెలుస్తోంది.

**రెండో వర్గం - బస్వరాజు సారయ్య వర్గం**

వరంగల్ పోచమ్మ మైదాన్ లో మొదలైన పంచాయితీ గల్లీ నుంచి ఢిల్లీకి చేరింది. కొండా కుటుంబం బస్వరాజు సారయ్య ల మధ్య సవాళ్లు ప్రతి సవాళ్లతో తెలంగాణ కాంగ్రెస్ ఒకసారిగా వేడెక్కింది. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య కు తూర్పులో ఇప్పటికీ సొంత క్యాడర్ ఉంది. తనకు మంత్రి పదవి రాకపోవడంతో అసంతృప్తితో ఉన్న సారయ్య వర్గం, కార్పొరేషన్ ఎన్నికల్లో తమ సత్తా చూపించాలని చూస్తోంది. తమను పక్కన పెడితే పార్టీకి నష్టమని హైకమాండ్ కు సంకేతాలు పంపుతోంది. మంత్రివర్గం నుండి కొండా సురేఖ ను బర్తరఫ్ చేయించింది నేనని ఎమ్మెల్సీ సారయ్య చెబుతూనే కొండా సురేఖ ను ఎమ్మెల్యేగా రాజీనామా చేయాలని మళ్లీ ఇండిపెండెంట్ గా తూర్పులో ఇరువురం పోటీ చేద్దాం అని సారయ్య బహిరంగంగా సవాల్ విసురుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీ మారితే రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకమేనని భావించిన కొండా సురేఖ అధికార పార్టీకి ఇటు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయలేక నమ్ముకున్న నాయకులకు కార్యకర్తలకు ఏం చెప్పుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి.

**మూడో వర్గం - డిసిసి అధ్యక్షుడు అయూబ్**

జిల్లా కాంగ్రెస్ కు పెద్ద దిక్కుగా ఉన్న నాయని రాజేందర్ రెడ్డి తర్వాత, ప్రస్తుత డిసిసి అధ్యక్షుడు మొహమ్మద్ అయూబ్ తన వర్గాన్ని బలంగా తయారు చేసుకున్నారు. పదవి లేకపోయినా గత 10 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని, జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలు చేశారు. అన్ని పార్టీ నేతలతో సాన్నిహిత్యంతో పాటు ఇతనికి మీడియా సపోర్ట్ కూడా ఉందనే విషయం తెలిసిందే. మైనార్టీ ఓటు బ్యాంకు, నగరంలోని యువతను నమ్ముకుని తన వర్గానికి ఎక్కువ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. సంస్థాగతంగా తన మాటే నెగ్గాలని ఆయన భావిస్తున్నారు.

**నాలుగో వర్గం -గుండు సుధారాణి వర్గం**

మాజీ మేయర్ గుండు సుధారాణి కి తూర్పు లోని మహిళా ఓటర్లలో, తన హయాంలో లబ్ధి పొందిన కాలనీల్లో ఇప్పటికీ పట్టు ఉంది. మేయర్ పీఠం మళ్ళీ తనకే కావాలనే లక్ష్యంతో ఆమె తన వర్గాన్ని యాక్టివ్ చేసింది. తన అనుచరులకు కార్పొరేటర్ టికెట్లు ఇవ్వకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని ఆమె వర్గం హెచ్చరిస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తూర్పు నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

**కార్పొరేషన్ ఎన్నికల్లో ఎఫెక్ట్ ఏంటి?**

నాలుగు వర్గాల మధ్య టికెట్ల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ఒక డివిజన్ కు ముగ్గురు నుంచి ఐదుగురు అభ్యర్థులు పోటీ పడుతున్నారు. టికెట్ రాని వారు జంప్ జిలానీ అవడం ఖాయమని టాక్. ఇప్పటికే కొందరు కార్పొరేటర్ ఆశావహులు బీఆర్ఎస్, బీజేపీ నేతలతో టచ్ లోకి వెళ్లారని ప్రచారం జోరుగా సాగుతోంది.పార్టీ అధికారంలో ఉన్నప్పుడే ఇలా నాలుగు ముక్కలైతే, కార్పొరేషన్ లో గెలవడం కష్టం. హైకమాండ్ వెంటనే జోక్యం చేసుకుని సర్ది చెప్పకపోతే, తూర్పులో కాంగ్రెస్ కొంప మునుగుతుంది అని సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మార్పు కోసం వివిధ పార్టీల సీనియర్ నాయకులు, కార్యకర్తల తో పాటు యువత ప్రత్యామ్నాయంగా నాలుగో పార్టీ జనసేన వైపు మొగ్గు చూపుతున్నారని తెలుస్తోంది. మొత్తానికి వరంగల్ తూర్పు కాంగ్రెస్ లో వర్గపోరు కార్పొరేషన్ ఎన్నికలకు హాట్ టాపిక్ గా మారింది.



# గణపతి ఉత్సవాల్లో అన్నదాన కార్యక్రమం విశిష్టమైనది

**బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

**బెల్లంపల్లి, మహా:** హిందూ సంప్రదాయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలకు విశిష్టమైన ప్రాధాన్యత ఉందని అందులో నిర్వహించే అన్నదాన కార్యక్రమం ఎంతో ప్రాశస్త్యాన్ని కలిగి ఉందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వెల్లడించారు. బుధవారం నాడు సోమగూడెం గ్రామపంచాయతీ పరిధి ఇందిరమ్మ కాలనీ లో నిర్వహించిన వినాయక అన్నదాన కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు దుర్గం చిన్నయ్య పాల్గొని వినాయకుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.బిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఉపసర్పంచ్ కుక్క రామ్ చందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం లో ఆయన పాల్గొని అన్న ప్రసాదం వడ్డించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ విఘ్నాలకు అధిపతి అయిన వినాయకుడి కృపాకటాక్షాలతో బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆకాంక్షించారు. అనంతరం గ్రామస్థులు, భక్తులతో ఆత్మీయంగా మమేకమైన మాజీ ఎమ్మెల్యే స్వయంగా భోజనాలు వడ్డించి ప్రజలతో తనకున్న అనుబంధాన్ని మరోసారి చాటుకున్నారు.పదవిలో ఉన్నా, లేకున్నా ప్రజల్లో ఒకరిగా కలిసిపోతూ, వారి సంతోషాల్లో భాగస్వామిగా నిలవడం తన బాధ్యతగా భావించే మాజీఎమ్మెల్యే తీరు పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, బి ఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# వయోవృద్ధుల సంఘ భవనాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్

- **వినాయక పూజా వేడుకలకు హాజరు**
- **సీనియర్ సిటిజన్స్ తో ముచ్చట**




**ఆదిలాబాద్ మహా:** ఆదిలాబాద్ పట్టణంలోని వయోవృద్ధుల సమాఖ్య జిల్లా సంఘ భవనాన్నిమున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ సందర్శించారు. భవనంలో నిర్వహించిన వినాయక పూజ వేడుకల్లో పాల్గొన్నారు. గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .ప్రతి ఒక్కరూ తమ మతాలు, కులాలు, ఆచారాలు, సంప్రదాయాలకు అనుగుణంగా పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు ప్రశాంతత లభిస్తుందని ఆమె తెలిపారు. సీనియర్ సిటిజన్స్‌తో కొద్దిసేపు సరదాగా క్యారం ఆడి, వారితో ఆప్యాయంగా ముచ్చటించారు.సీనియర్ సిటిజన్స్ అందించిన పుస్తకాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల సమాఖ్య నాయకులు, సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తొలిదశలోనే వ్యాధులు గుర్తిస్తే మేలు

**విశ్వనాథపల్లిలో పశువైద్య శిబిరం**



**కారేపల్లి మహా :** పశువులకు వచ్చే వ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే వ్యాధి నివారణ సులభం అవుతుందని మండల పశువైద్యాధికారి డాక్టర్ క్రాంతికుమార్ అన్నారు. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం కారేపల్లి మండలం విశ్వనాథపల్లిలో ప్రత్యేక పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరాన్ని సర్పంచ్ ఇస్లావత్ రాజు, ఉప సర్పంచ్ బొమ్మల ధనమ్మలు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశువుల్లో గర్భకోశ వ్యాధులను తొలి దశలో గుర్తించి చికిత్స అందించాలని సూచించారు. పశువుల ఆరోగ్య పరిరక్షణ, సంతానోత్పత్తి మెరుగుదల లక్ష్యంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆయనతెలిపారు. పశువులకు సమతుల్య పోషకాహారం, ఖనిజ లవణాలు అందించాలని తెలిపారు. ఎద లక్షణాలను సకాలంలో గుర్తించి సరైన సమయంలో కృత్రిమ గర్భధారణ చేయించడం ద్వారా సంతానోత్పత్తి సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చన్నారు. సెక్స్ సార్టెడ్ సీమెన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బొగ్గారపు ముఖర్జీ, గోపాలమిత్ర సూపర్వైజర్ వెంకటేష్, గోపాలమిత్రులు రేగళ్ల మంగయ్య, సురభి శ్రీకాంత్, సమ్మయ్య, మోత్కూరి రామారావు, రవి, గ్రామ పెద్దలు వల్లభనేని ప్రభాకర్, వడ్డె వెంకటేశ్వర్లు, తాతా అచ్చారావు, వడ్డె రమేష్, తమ్మినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల అందించాలి

- **జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్**




**మంచిర్యాల, మహా :** గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందించాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ భాస్కర్, అదనపు కలెక్టర్లు పి చంద్రయ్య, వి .రాములు, బెల్లంపల్లి సప్తలక్టర్ మనోజ్, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్, డైరెక్టర్ ఆఫ్ కమిషన్ కళ్యాణ్, ఉట్నూర్ సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, ఎ.పి.ఓ. వసంత్ రావులతో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ కమిషన్ సభ్యులు మాట్లాడుతూ ఆదివాసీ, గిరిజనుల కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా అమలు చేసి సంక్షేమ ఫలాలను లబ్ధిదారులను అందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. గిరిజన ప్రజలకు మౌలిక వసతులు, విద్య, వైద్యం, విద్యుత్, సాగునీరు, త్రాగునీరు, ఉపాధి, భద్రత తదితర సదుపాయాలు సమర్థవంతంగా అందించాలని తెలిపారు. అటవీ శాఖ పరిధిలో గిరిజనుల హక్కులు, అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు అందుతున్న సౌకర్యాలు, అటవీ ఆధారిత జీవనోపాధి, గిరిజన ప్రాంతాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించి గిరిజనుల జీవనోపాధికి ఇబ్బందులు కలగకుండా, వారి హక్కులను పరిరక్షిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గిరిజన ప్రాంతాలలో శాంతిభద్రతల పరిస్థితి, గిరిజన ప్రజల భద్రత, వారి నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం, పోలీస్ స్టేషన్లలో గిరిజనుల సమస్యలపై స్పందన, మహిళలు, బాలల రక్షణ, గిరిజనుల హక్కులకు సంబంధించిన అంశాలపై పోలీస్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీస్ శాఖ దృష్టికి తీసుకువచ్చేలా అనుకూల వాతావరణం కల్పించాలని, వారి ఫిర్యాదులను సత్వరమే స్వీకరించి చట్టపరంగా పరిష్కరించాలని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, గిరిజనులపై దాడులు, వారి హక్కులకు భంగం కలిగించే ఘటనల విషయంలో పోలీస్ శాఖ తక్షణమే స్పందించాలని ఆదేశించారు. గిరిజన ఆవాసాలు, తండాలు, గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరా పరిస్థితి, కొత్త విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యుత్ అంతరాయాల సమస్యలు తదితర అంశాలను సమీక్షించి సౌకర్యాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం, సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాలువలు, నీటి వనరుల వినియోగం తదితర అంశాలపై సమీక్షించి గిరిజన రైతులకు సాగునీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వ్యవసాయ ఆధారిత జీవనోపాధిని బలోపేతం చేయాలని సూచించారు. గిరిజన ప్రాంతాలలో ప్రాథమిక ఆరోగ్య సేవలు, వైద్య సిబ్బంది అందుబాటు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న వైద్య సేవలు, టీకాలు, పోషకాహారం, అత్యవసర వైద్య సేవలు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకొని దూర ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. షెడ్యూల్డ్ తెగల విద్యార్థులకు విద్యా అవకాశాలు మెరుగుపరచాలని, వసతి సౌకర్యాలు కల్పించాలని, ఉన్నత విద్యకు ప్రోత్సాహం ప్రోత్సహించాలని, నైపుణ్యాభివృద్ధి ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలిపారు. గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తి స్థాయిలో అమలుపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అర్హులైన గిరిజన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల నుంచి ఎలాంటి కారణంతోనూ దూరం కాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్య, వైద్యం, విద్యుత్, త్రాగునీరు, సాగునీరు, రహదారులు, గృహ వసతి, ఉపాధి, మౌలిక వసతులు, శాంతి భద్రతలు, సామాజిక భద్రత అంశాలలో గిరిజనులకు అందుతున్న సేవలను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని తెలిపారు.ప్రభుత్వం షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి కోసం రూపొందించిన పథకాలు ప్రతి అర్హత కలిగిన గిరిజన కుటుంబానికి ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పథకాల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, శాఖల వారీగా పరిష్కార మార్గాలను రూపొందించాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసే సమయంలో స్థానిక ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయం పెంచి, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. షెడ్యూల్డ్ తెగల ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చూడటం సంబంధిత శాఖల బాధ్యత అని తెలిపారు. గిరిజనుల భూమి, జీవనోపాధి, విద్య, ఆరోగ్యం, ఉపాధి, భద్రత వంటి అంశాలలో సమస్యలు తలెత్తినప్పుడు సంబంధిత శాఖలు వేగంగా స్పందించాలని, గిరిజన ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఈ సమావేశంలో జిల్లా పోలీస్, అటవీ, విద్యుత్, నీటిపారుదల, వైద్య ఆరోగ్య, గిరిజన సంక్షేమ, రెవెన్యూ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిభకు ప్రోత్సాహం.. పోలీసు సిబ్బందికి నగదు రివార్డులు

- **నేర నియంత్రణ, సైబర్ క్రైమ్‌లో విశేష కృషి చేసిన అధికారులకు సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందనలు**

**పెద్దపల్లి మహా :** విధి నిర్వహణలో అంకితభావం, నిబద్ధతతో ప్రతిభ కనబరిచిన సీసీఆర్‌బీ, సీసీఎస్, టాస్క్‌ఫోర్స్, ఐటీ కోర్, సైబర్ క్రైమ్ విభాగాల అధికారులు, సిబ్బందికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. నేరాల నియంత్రణ, నేరస్తుల గుర్తింపు, సైబర్ నేరాల అరికట్టడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంలో విశేష కృషి చేసిన సిబ్బందిని ఈ సందర్భంగా సీపీ అభినందించారు. వివిధ పోలీసు విభాగాలు సమన్వయంతో పనిచేయడం ద్వారా నేరాలను మరింత సమర్థవంతంగా నియంత్రించడంతో పాటు కేసుల దర్యాప్తులో వేగం, నాణ్యత పెరుగుతాయని సీపీ తెలిపారు. సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ అనిల్, సీసీఎస్ ఏసీపీలు రవీందర్, ప్రవీణ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌గౌడ్, సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయా విభాగాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. సైబర్ నేరాల నియంత్రణ, బాధితులకు సత్వర సహాయం, నేరాలకు సంబంధించిన సమాచార విశ్లేషణ, నేరస్తుల గుర్తింపులో అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషిని సీపీ ప్రశంసించారు. అలాగే నేర నియంత్రణ, అక్రమ కార్యకలాపాలపై నిఘా, నేరస్తుల కదలికలను గుర్తించడం, కేసుల దర్యాప్తునకు అవసరమైన సమాచారాన్ని సేకరించడంలో టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని అభినందించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది తమకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధత, క్రమశిక్షణ, సమయస్ఫూర్తితో నిర్వహించాలని సీపీ సూచించారు. విధుల్లో ప్రతిభ కనబరిచే సిబ్బందిని గుర్తించి ప్రోత్సహించడం ద్వారా ఇతర సిబ్బందిలోనూ మరింత ఉత్సాహం, బాధ్యతాభావం పెరుగుతుందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఇదే అంకితభావంతో విధులు నిర్వహిస్తూ రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణకు మరింత కృషి చేయాలని సీపీ సూచించారు.




# రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ

**పెద్దపల్లి మహా :** వార్షిక తనిఖీలలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న సీపీకి సీఐ రమేష్, ఎస్ఐ శ్రీధర్ మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన సీపీ, పోలీస్ అధికారులతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన సీపీ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను క్రమబద్ధంగా ఉంచడంతో పాటు వాటి వివరాలను సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. రిసెప్షన్ కేంద్రం, సిబ్బంది బ్యారక్, రికార్డులను పరిశీలించి, పోలీస్ స్టేషన్‌లో 5S విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్ ద్వారా వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియను కూడా పరిశీలించారు.

స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ తదితర అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదపూర్వకంగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రామకృష్ణాపూర్ ప్రాంతంలో హైవే, రైల్వే స్టేషన్‌తో పాటు కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో శాంతిభద్రతలు, రహదారి భద్రత, మహిళల భద్రత, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. రైలు, రోడ్డు మార్గాల ద్వారా గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నిఘా, సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజల భాగస్వామ్యంతో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ద్వారా ఆస్తి నేరాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధిస్తున్న సిబ్బందిని సీపీ అభినందించారు. కొత్త కాలనీల్లో వృద్ధుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ బ్లూకోట్స్ సిబ్బంది క్రమం తప్పకుండా పర్యటించాలని, వృద్ధుల భద్రత కోసం ప్రత్యేక ఎస్ ఓ పి రూపొందించి అమలు చేయాలని ఆదేశించారు. పోలీస్ సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు స్టేషన్ నిర్వహణపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఐ, ఎస్ఐలకు సూచించిన సీపీ.. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ నిర్వహణ బాగుందని ప్రశంసించారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.



# పందిల్ల ప్రభుత్వ పాఠశాలలో అల్పాహారం, యూనిఫామ్‌ల పంపిణీ

**పెద్దపల్లి మహా :** కాల్వశ్రీరాంపూర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అల్పాహార కార్యక్రమంలో భాగంగా హరే రామ కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెద్దపల్లి నియోజకవర్గం కాల్వశ్రీరాంపూర్ మండలం పందిల్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం, స్కూల్ యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ మిట్టపల్లి కొమురయ్య, ఉప సర్పంచ్ ధర్మల రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్యామ్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అల్పాహారం అందించడంతో పాటు స్కూల్ యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణు , వార్డు సభ్యులు చిలుముల వినేష్, గ్రామస్తులు ప్రశాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్యే

- **ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం**
- **విద్యార్థుల ఆకలిని తరిమి.. అక్షరానికి అండగా నిలవడమే ధ్యేయం**
- **రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.**
- **కరీంనగర్‌లో రూ.8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభం**
- **49,025 మంది విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం**



**కరీంనగర్ మహా :** పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా.. వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్ యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు.

**విద్యే.. పిల్లలకు గొప్ప ఆస్తి**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు, నిధులు వంటి ఆస్తులు ఉండేవని, ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. ఇటీవల జరిగిన సిప్ సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు.

**ఆకలితో చదువుకు ఆటంకం ఉండొద్దు**

ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడని మంత్రి అన్నారు. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల హాజరు, సమయపాలన, విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా, సమయపరంగా ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

కరీంనగర్‌లో 49,025 మందికి అల్పాహారం

కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు.

**అధునాతన యంత్రాలతో ఆహార తయారీ**

కిచెన్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారు చేసే మిషన్లు ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. పాత్రలు శుభ్రం చేసే మిషన్లు, పాల కేంద్రం, ఆహార పదార్థాల టెస్టింగ్ ల్యాబ్, కూరగాయలు కట్ చేసే మిషన్లు, కూరగాయలు కడిగే మిషన్లు, చట్నీ పౌడర్ తయారీ మిషన్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. వాటి పనితీరును స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులకు ఒకే విధమైన నాణ్యతతో, పరిశుభ్రంగా అల్పాహారం అందించడమే కేంద్రీకృత వంటశాలల ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఆహార భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ ISO స్థాయి ప్రమాణాలను పాటించేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. థర్మల్ ఇన్సులేటెడ్ వాహనాల ద్వారా పాఠశాలలకు సకాలంలో అల్పాహారం తరలిస్తామని తెలిపారు. విద్యార్థులకు ఇష్టమైన, సాధారణంగా ఇళ్లలో తినే ఆహార పదార్థాలతో మెనూ రూపొందించామని, మెనూ రూపకల్పనలో NIN సహకారం తీసుకున్నామని చెప్పారు.

**వారంలో ఆరు రకాల అల్పాహారం**

సోమవారం ఇడ్లీ-సాంబార్, మంగళవారం పూరీ-ఆలూ కుర్మా, బుధవారం దోశ-చట్నీ, గురువారం ఉప్మా-చట్నీ, శుక్రవారం మిల్లెట్ ఇడ్లీ-సాంబార్, శనివారం బోండా-చట్నీ అందిస్తామని మంత్రి వివరించారు. రోజు విడిచి రోజు విద్యార్థులకు పాలు కూడా అందిస్తామని తెలిపారు.

**కొడంగల్‌లో పైలట్ ప్రాజెక్ట్..**

2024 డిసెంబర్‌లో కొడంగల్‌లో స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించామని మంత్రి తెలిపారు. అక్కడ విద్యార్థుల హాజరు 75 శాతం నుంచి 90 శాతానికి పెరిగినట్లు గుర్తించామని చెప్పారు. విద్యార్థుల్లో ఏకాగ్రత, తరగతి గది భాగస్వామ్యం, సమయపాలన మెరుగుపడినట్లు, ఆలస్యంగా పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్య తగ్గినట్లు తెలిపారు. కొడంగల్‌లో అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని విస్తరిస్తున్నామని చెప్పారు.

**రాష్ట్రవ్యాప్తంగా 17.72 లక్షల మంది విద్యార్థులకు**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 17,72,291 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించేలా స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని విస్తరించే ప్రతిపాదనలు ఉన్నాయని మంత్రి తెలిపారు. 23,106 ప్రభుత్వ పాఠశాలలను కార్యక్రమం పరిధిలోకి తీసుకురానున్నామని చెప్పారు.

31 జిల్లాల్లో 31 కేంద్రీకృత మెగా/కమ్యూనిటీ కిచెన్లు ఏర్పాటు చేసే ప్రణాళిక ఉందని, వీటి కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.245 కోట్ల వ్యయం అంచనా వేసినట్లు తెలిపారు. అల్పాహారం పంపిణీకి సుమారు 1,400 వాహనాలు, 5,000 మంది సిబ్బంది అవసరమవుతారని చెప్పారు. కేంద్రీకృత వంటశాలల ద్వారా సుమారు 15,000 ప్రత్యక్ష, 10,000 పరోక్ష ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు.

**హరే కృష్ణ మూవ్‌మెంట్‌కు ధన్యవాదాలు**

స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమంలో ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా వ్యవహరిస్తున్న హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ప్రపంచవ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం CSR నిధుల కింద సంస్థకు సహకరిస్తోందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమంలో భాగస్వామిగా నిలిచినందుకు తెలంగాణ ప్రభుత్వం తరఫున ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

గతంలో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్న సమయంలో ఇదే ఫౌండేషన్ ద్వారా కరీంనగర్‌లో ఆలయం నిర్మించాలని అనుకున్నామని, ఆ అంశం ప్రస్తుతం పెండింగ్‌లో ఉందని చెప్పారు. మళ్లీ ఫౌండేషన్‌తో కలిసి ఆ దిశగా ముందుకు వెళ్లే ప్రయత్నం చేస్తామని తెలిపారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ క్యాంటీన్లను కూడా హరే కృష్ణ మూవ్‌మెంట్ నిర్వహిస్తోందని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి విజిలెన్స్ విచారణ పూర్తయిందని, కళాశాలలకు రావాల్సిన బకాయిలను విడుదల చేస్తున్నామని మంత్రి తెలిపారు.

**విద్యార్థులతో కలిసి అల్పాహారం**

సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభోత్సవం సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ విద్యార్థులకు స్వయంగా అల్పాహారం వడ్డించి వారితో కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. అనంతరం కిచెన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి వాటి పనితీరు, ఆహార తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.




# ఘనంగా బార్బర్స్ డే వేడుకలు

**జెండా ఆవిష్కరించిన కడియాల**

**జూలూరుపాడు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలూరుపాడు మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో బార్బర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో నాయి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్ లో నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు కడియాల సత్యనారాయణ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 16 న నాయి బ్రాహ్మణులకు స్వాతంత్రం వచ్చిన రోజుగా అభివర్ణించారు. 365 రోజులలో 364 రోజులు శ్రమ దోపిడీకి గురవుతున్న మాకు ఈ రోజునే విశ్రాంతి కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నాయి బ్రాహ్మణ మిత్రులందరికీ బార్బర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కుదురుపాక నిర్మల, జిల్లా నాయకులు కొల్లిపాక వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ సహాయ కార్యదర్శి మార్యాపూరి నరసింహారావు, డివిజన్ సహాయ కార్యదర్శి వల్లోజి రమేష్, వైరా నియోజకవర్గం ఇన్చార్జి మాడుగుల నాగరాజు, కో కన్వీనర్ కడియాల పుల్లయ్య, మండల అధ్యక్షుడు కడియాల శ్రీను, కార్యదర్శి పెద్దవరపు కృష్ణార్జునరావు తో పాటు మహిళలు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి తాపీ కార్మిక సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా నియామకం

**అధ్యక్షుడు సంకరి క్రిష్ణ,ప్రధాన కార్యదర్శి యెలుగం శ్రీనివాస్ లు వెల్లడి**

**బెల్లంపల్లి ,మహా :** బెల్లంపల్లి పట్టణ తాపీ కార్మిక సంఘం నూతన పూర్తిస్థాయి కమిటీని బుధవారం నాడు ఏకగ్రీవంగా నియమించినట్లు అధ్యక్షుడు సంకరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి యెలుగం శ్రీనివాస్ లు సంయుక్తంగా వెల్లడించారు. బుధవారం నాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోశాధికారి గా చీకటి సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా జనగామ రామచందర్, సంకరి సతీష్, కార్యనిర్వాహక అధ్యక్షులు గా ముత్తె రమేష్, సహాయ కార్యదర్శి గా యంజాల కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి గా ఎండి అంకుష్,ప్రచార కార్యదర్శిగా సింగతి తిరుపతి తో పాటు మరో 20 మంది సభ్యులను ఏరియాల వారీగా గుర్తించి ఎన్నుకున్నట్లు తెలిపారు.ఎన్నికైన అనంతరం కమిటీ సభ్యులందరు కలిసి గౌరవ అధ్యక్షులు గా అవుల కొమురయ్యను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు తాపీ సంఘ పటిష్టతకు కార్మికులసంక్షేమానికి కృషి చేస్తామని సంయుక్తంగా ప్రకటించారు.



# హమారా ప్రసాద్ ను అరెస్టు చేయండి

**ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**
**జిల్లా ఎస్పీకి ఫిర్యాదు పత్రం**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ఎన్నో సేవలందించి అన్ని వర్గాల ప్రజల గుండెల్లో నిలిచిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ను అవమానపరుస్తూ భారత రాజ్యాంగాన్ని అవహేళన చేసిన హమారా ప్రసాద్(ఆవారా ప్రసాద్)ను వెంటనే అరెస్ట్ చేయాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ డిమాండ్ చేశారు. భారతరత్న అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలను చేసిన హిందూ మతతత్వ ఉగ్రవాది హమారా ప్రసాద్(ఆవారా ప్రసాద్)ను వెంటనే అరెస్ట్ చేయాలని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ నేతృత్వంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుకు బుధవారం ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ పై హమారా ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సహించరానిదన్నారు. హిందూ మతతత్వ ఉగ్రవాదులతో కుమ్మక్కై డబ్బులకు లొంగిపోయి మత విద్వేషాలకు కులవిద్వేషాలకు వేర్పాటువాదానికి హింసకాండకు దోహదపడుతున్న దుర్మార్గుడు హమారా ప్రసాద్ ను యుఏపిఏ చట్టం కింద అరెస్టు చేసి యావజ్జీవ కారాగార శిక్షను విధించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18వ తేదీన రిలీజ్ చేస్తానన్న కల్పిత అంబేద్కర్ పుస్తకాన్ని రిలీజ్ కాకుండా నిరోధించాలని తద్వారా దేశ సమైక్యతకు సమగ్రతకు శాంతి భద్రతలకు ముప్పు వాటిల్లకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా గురువారం తలపెట్టిన కొత్తగూడెం బంద్ ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలియజేశారు. తొలుత అంబేద్కర్ సెంటర్ (పోస్ట్ ఆఫీస్ సెంటర్ )వద్ద గల బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి నాయకులందరూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతేగాక ఫిర్యాదు మెమోరాండమును అంబేద్కర్ విగ్రహానికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జెబి శౌరి, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంతోటి పాల్, అభ్యుదయ వాది సామాజిక వాది అంబేద్కర్ పూలే వాది మల్లెల రామనాథం, తెలంగాణ ఉద్యమ యోధులు రాష్ట్ర మైనార్టీ నాయకులు సయ్యద్ రషీద్, టిఈఏఎం రాష్ట్ర కన్వీనర్ దాసరి రమేష్, కో కన్వీనర్ శెట్టి కమలాకర్, ప్రముఖ అంబేద్కర్ వాది న్యాయవాది మారపాక రమేష్, అంబేద్కర్ వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు పి.సురేందర్, ఎమ్మార్పీఎస్ నాయకులు మోదుగు జోగారావు, జిల్లా మైనారిటీ నాయకులు సల్మాన్ ఖాన్ తోత, జిల్లా మాల మహానాడు నాయకులు సల్లం శంకర్, తిరుపతి, ప్రభాకర్, పురుషోత్తం, రాజేశ్వరరావు, భారత రత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా నాయకురాళ్లు బడికల పుష్పలత, కరీష రత్నకుమారి, కొదురుపాక మీనాక్షి, జోగు రమాదేవి, యువ నాయకులు రత్న, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు మద్దెల ఆదర్శ్, కేదాసి కిరణ్, అఫ్రయిమ్ చింటూ, సుమన్, అఖిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై కలెక్టర్ కన్నెర

- **మెనూ అమలులో నిర్లక్ష్యంపై వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీకి ఆదేశాలు**
- **పనిచేయని ఆర్వో ప్లాంట్‌కు వెంటనే మరమ్మతులు చేపట్టాలి**
- **శుభ్రత పాటించకపోతే చర్యలు తప్పవు**
- **వసతి గృహంలో సౌకర్యాలు ఆహార పదార్థాల నాణ్యతపై పరిశీలన**



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** పాఠశాల పరిసరాల పరిశుభ్రతపై జిల్లా కలెక్టర్ అంకిత్ కన్నెర చేయడంతో పాటు మెనూ అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల తండాలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన కలెక్టర్ అక్కడ అపరిశుభ్రతతో పాటు చెత్త ఉండటాన్ని గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని ఎన్‌సీసీ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ ఎన్‌సీసీలో ఉన్న విద్యార్థుల సంఖ్య గత సంవత్సరం ఉత్తీర్ణత శాతం తదితర వివరాలను ఉపాధ్యాయులు అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. తదుపరి బాలుర వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు అందుతున్న వసతి తాగునీరు పారిశుద్ధ్యం భోజనం తదితర సౌకర్యాలను పరిశీలించారు. కిచెన్ షెడ్ స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి నిల్వ ఉంచిన సరుకులు ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. కిచెన్‌లోని ఆర్వో వాటర్ ప్లాంట్ పని చేయకపోవడాన్ని గమనించిన కలెక్టర్ అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే అవసరమైన మరమ్మతులు చేపట్టి ఆర్వో ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న సౌకర్యాలు భోజనం తాగునీరు తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజూ నాణ్యమైన పౌష్టికాహారం అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం మెనూలో చికెన్ అందించాల్సి ఉన్నప్పటికీ విద్యార్థులకు వడ్డించిన భోజనంలో చికెన్ లేకపోవడాన్ని కలెక్టర్ గమనించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందించడంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేస్తూ సంబంధిత వార్డెన్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమం ఆరోగ్యం విషయంలో అధికారులు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీల్లో కలెక్టర్ వెంట లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, ఉపాధ్యాయులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## యంబీసి రాష్ట్ర అధ్యక్షులుగా కుమ్మరి శివ శంకర్

**మొయినాబాద్ మహా:** కష్టపడ్డ వారికి తెలంగాణ రక్షణ సేన పార్టీలో మంచి స్థానం ఉంటుందని పార్టీని అధికారంలోకి వచ్చే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని తెలంగాణ రక్షణ సేన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మ అన్నారు బుధవారం నాడు తెలంగాణ రక్షణ సేన కేంద్ర కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుడు మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరు గ్రామానికి చెందిన కుమ్మరి శివశంకర్ ను ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు కుమ్మరి శివ శంకర్ మాట్లాడుతూ కల్వకుంట్ల కవితమ్మ తీసుకున్న ప్రతి విషయంలో వారి నాయకత్వంలో ఎప్పటికీ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని వారిని తెలంగాణ రాష్ట్రనికి ముఖ్యమంత్రిని చేసే వరకు తెలంగాణ రక్షణ సేన ప్రతి విభాగం పని చేస్తుందని వారు అన్నారు నా పైన నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షులుగా నియమించిన కల్వకుంట్ల కవితమ్మకు మరియు సహకరించిన టిఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## విపత్తుల సమయంలో ఆపదమిత్రల పాత్ర కీలకం

**తక్షణ సహాయ చర్యలకు సిద్ధంగా ఉండాలి**
**భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్**





**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** విపత్తులు సంభవించిన సమయంలో తక్షణమే స్పందించి ప్రాణ ఆస్తి నష్టాన్ని తగ్గించడంలో ఆపదమిత్రలు కీలక పాత్ర పోషించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండ ఆరవ బెటాలియన్ తెలంగాణ స్పెషల్ పోలీస్ ఆధ్వర్యంలో యువ ఆపదమిత్రల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా 6వ బెటాలియన్‌కు చేరుకున్న కలెక్టర్‌కు బెటాలియన్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ భౌగోళిక వాతావరణ పరిస్థితుల వైవిధ్యం కారణంగా దేశంలో వివిధ రకాల విపత్తులు సంభవించే అవకాశం ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోదావరి వరదలు ఆకస్మిక వరదలు పట్టణ ప్రాంతాల్లో నీటి ముంపు అటవీ అగ్నిప్రమాదాలు పారిశ్రామిక ప్రమాదాలు తదితర విపత్తులు సంభవించే అవకాశం ఉన్నందున స్థానికంగా శిక్షణ పొందిన యువత అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునే లోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు తక్షణ సహాయక చర్యలు చేపట్టడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చన్నారు. విపత్తుల సమయంలో శారీరక దృఢత్వంతో పాటు మానసిక అప్రమత్తత సమయస్ఫూర్తి పరిస్థితిని వేగంగా అంచనా వేసే సామర్థ్యం సరైన నిర్ణయం తీసుకునే నైపుణ్యం ఎంతో కీలకమని కలెక్టర్ తెలిపారు. శిక్షణలో భాగంగా ప్రామాణిక నిర్వహణ విధానాలు సమాచార ప్రసారం రెస్క్యూ పరికరాల వినియోగం బృంద సమన్వయం వంటి అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. విపత్తు నిర్వహణ అనేది కేవలం తరగతి గదిలో నేర్చుకునే అంశం కాదని క్షేత్రస్థాయిలో నిరంతర సాధన మాక్ డ్రిల్స్ ద్వారా నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాల్సి ఉంటుందని అన్నారు. శిక్షణను పూర్తి ఏకాగ్రతతో తీసుకుని నేర్చుకున్న అంశాలను పదేపదే సాధన చేసి జిల్లాకు ఉపయోగపడేలా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అవసరమైన రెస్క్యూ పరికరాలు కిట్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. 6వ బెటాలియన్ కమాండెంట్ పి.సి.వి. రమణ మాట్లాడుతూ విపత్తులు సంభవించిన తొలి కొన్ని నిమిషాలు అత్యంత కీలకమన్నారు. అధికారిక సహాయక బృందాలు సంఘటనా స్థలానికి చేరుకునేలోపు స్థానికంగా శిక్షణ పొందిన ఆపదమిత్రలు వేగంగా స్పందించి ప్రాథమిక సహాయక చర్యలు చేపట్టగలరన్నారు. శిక్షణలో బోట్ నిర్వహణ తాళ్ల సహాయంతో రక్షణ చర్యలు పైకి ఎక్కడం కిందికి దిగడం రాక్ క్లైంబింగ్ వివిధ రకాల ముడుల వినియోగం వంటి ప్రాక్టికల్ అంశాలను పూర్తిగా నేర్చుకోవాలని సూచించారు. శిక్షణలో ఏదైనా అంశం స్పష్టంగా అర్థం కాకపోతే శిక్షకులను అడిగి తెలుసుకుని పదేపదే సాధన చేయడం ద్వారా పూర్తి నైపుణ్యం ఆత్మవిశ్వాసం సాధించాలని తెలిపారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఆపదమిత్రలకు జిల్లా కలెక్టర్ అంకిత్ చేతుల మీదుగా శిక్షణ కిట్లను అందజేశారు. విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో స్వచ్ఛందంగా పాల్గొనేందుకు ముందుకు వచ్చిన ఆపదమిత్రలకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. శిక్షణ పొందుతున్న ప్రతి ఆపదమిత్రకు మూడు సంవత్సరాల కాలానికి రూ.5 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మొత్తం 416 మంది ఆపదమిత్రులకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగా తొలి విడతగా 120 మందికి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమాండెంట్ శ్రీధర్ రాజా, అసిస్టెంట్ కమాండెంట్ మరియా దాస్, లక్ష్మీదేవిపల్లి తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో సుచిత్ర, పోలీసు రెవెన్యూ విపత్తు నిర్వహణ శాఖల అధికారులు శిక్షకులు ఆపదమిత్రలు తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి..

- ఓటర్ల పేర్లు తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- అనర్హుల పేర్లు జాబితాలో కొనసాగకుండా పరిశీలించాలి
- ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి..
- పినపాక ఈఆర్‌వో, ఐటీడీఏ పీవో బి రాహుల్

**మణుగూరు, మహా :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని 110పినపాక నియోజకవర్గ ఈఆర్‌వో, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అనర్హుల పేర్లు జాబితాలో కొనసాగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సమగ్ర పరిశీలన చేపట్టాలని సూచించారు. బుధవారం మణుగూరులోని సమితి సింగారం గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ఓటర్ల నమోదు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మణుగూరు తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఓటర్లకు నోటీసుల జారీ, పంపిణీ, విచారణల నిర్వహణ, పెండింగ్ కేసులు, ధ్రువపత్రాల పరిశీలనతో పాటు క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారు.

**434 మందికి విచారణ..**

పినపాక నియోజకవర్గంలో 434 మందిని విచారణకు పిలిచినట్లు రాహుల్ తెలిపారు. వారిలో దాదాపు 60 శాతం మంది హాజరవుతున్నారని, హాజరవుతున్న వారిలో 30 నుంచి 40 శాతం మంది సరైన ధ్రువపత్రాలు లేకుండానే వస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. విచారణ తేదీకి ముందుగానే సంబంధిత ఓటర్లు సమర్పించాల్సిన ధ్రువపత్రాల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అవసరమైన పత్రాలతో విచారణకు హాజరయ్యేలా బీఎల్‌వోలు, బీఎల్ఏల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

**ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలి**

బీఎల్‌వోలు, బీఎల్ఏలు ప్రతి ఇంటినీ సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియతో పాటు అవసరమైన ధ్రువపత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించాలని రాహుల్ సూచించారు. పుట్టిన తేదీ, వయస్సు తదితర వివరాల నిర్ధారణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన పత్రాలను సమర్పించేలా ఓటర్లకు వివరించాలన్నారు. పేరు లేదా ఇతర వివరాల్లో వ్యత్యాసాలు ఉండి తగిన ఆధారాలు అందుబాటులో లేని సందర్భాల్లో నిబంధనల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన, పంచనామా తదితర ప్రక్రియ చేపట్టాలని సూచించారు. నోటీసు అందజేసిన తర్వాత సంబంధిత బీఎల్‌వో రసీదు వివరాలను తప్పనిసరిగా యాప్‌లో నమోదు చేయాలని, ఆ వివరాలు నమోదైన తర్వాతనే నోటీసు అందజేత ప్రక్రియ పూర్తయినట్లుగా పరిగణించాలని తెలిపారు. పెండింగ్ నోటీసుల పంపిణీని నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల పేర్ల తొలగింపునకు సంబంధించిన ప్రతి కేసును సమగ్రంగా పరిశీలించి, నిర్ణయానికి గల కారణాలను స్పష్టంగా నమోదు చేయాలన్నారు. అర్హులైన వారికి ఓటు హక్కు నిరాకరించకుండా చూడటం, అర్హత లేని వారి పేర్లు జాబితాలో కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశమని రాహుల్ పేర్కొన్నారు. సమావేశంలో మణుగూరు తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీవో శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, ఎన్నికల విధుల సిబ్బంది అనూష, రామారావు తదితరులు పాల్గొన్నారు.



## సాంకేతిక విద్యాశాఖను నిర్వీర్యం చేయొద్దు

- పాలిటెక్నిక్‌ల విలీన ఆలోచనను విరమించుకోవాలి
- జీవో 97ను రద్దు చేయాలి.. శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలి
- ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి అజిత్

**మణుగూరు, మహా :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర శాఖలు లేదా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పరిధిలో విలీనం చేసే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి వరక అజిత్ డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను దెబ్బతీసేలా ఉందని పేర్కొంటూ జీవో నంబర్ 97ను రద్దు చేయాలని, శక్తి పాలసీని వెనక్కి తీసుకోవాలని కోరారు. మణుగూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు బుధవారం తరగతులను బహిష్కరించి ఏఐఎస్ఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అజిత్ మాట్లాడుతూ.. పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించడంలో పాలిటెక్నిక్ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పరిధిలోనే కొనసాగించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల వ్యవస్థ బలహీనపడితే పేద, మధ్యతరగతి విద్యార్థులకు తక్కువ ఖర్చుతో డిప్లొమా విద్య అందే అవకాశాలు తగ్గుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

**6సౌకర్యాలు పెంచాలి.. అధ్యాపకులను భర్తీ చేయాలి**

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అజిత్ పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడంతో పాటు ల్యాబ్‌ల ఆధునికీకరణ, వర్క్‌షాప్‌ల నిర్వహణ, హాస్టళ్ల అభివృద్ధి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. సాంకేతిక విద్యామండలిని విశ్వవిద్యాలయంగా అప్‌గ్రేడ్ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించిందని, అనంతరం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటైందని అజిత్ పేర్కొన్నారు. తాజాగా ఐటీఐలు, ఏటీసీలు, పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలనే ఆలోచనలు విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సాంకేతిక విద్యను మరింత బలోపేతం చేసి పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉంచాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యావ్యవస్థను ప్రభావితం చేసే నిర్ణయాలపై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగిస్తామని అజిత్ తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు గూగుల్ యువరాజ్, కృష్ణ, సాయి, అజయ్, వంశీ, మహేష్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.



## నిర్బంధాలతో పోరాటలను అడ్డుకోలేరు

- సిఐటియు జిల్లాకార్యదర్శి ఎజె.రమేష్
- నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ సామూహిక దీక్ష

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ప్రభుత్వం నిర్బంధాలతో పోరాటాలను అడ్డుకోలేదని సిఐటియు జిల్లాకార్యదర్శి ఎజె.రమేష్ అన్నారు. సీఐటీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ సెంటర్ లో కార్మిక ప్రజా పోరాటాలపై రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సామూహిక నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చి అమలు చేస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి నేటి వరకు అమలు చేయలేదు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1,000 రోజులు గడిచినప్పటికీ కార్మిక వర్గానికి ఇచ్చిన హామీలలో ఒక్క హామీ కూడా అమలుపరచలేదన్నారు. కార్మిక వర్గం తమ సమస్యల పరిష్కారం కోసం ఆందోళన పోరాటాలు చేస్తుంటే రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తో పాటు వివిధ జిల్లాల్లో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తుందన్నారు. అర్ధరాత్రి పూట మహిళా కార్మికుల ఇండ్లకు వెళ్ళి దౌర్జన్యపూరితంగా వ్యహరిస్తున్నారని పెర్కొన్నారు. మహిళాకార్మికులంటే ప్రభుత్వానికి చులకన భావంవుందన్నారు. నిర్బంధం ఇదే రూపంలో కొనసాగిస్తే ప్రతిఘటన కూడా తీవ్ర స్థాయిలో ఉంటుందని హెచ్చరించారు. భవిష్యత్తులో మరిన్ని సమరసిల పోరాటాలకు కార్మిక వర్గం సమయతమవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని రాష్ట్రంలోని ప్రతి కార్మికుడికి పిఎఫ్ ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం సిఐటియు తోటి రాష్ట్ర ముఖ్యమంత్రి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే గత పాలకులకు పట్టిన పరిస్థితి ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో కనీసం ధర్నా చేసుకునేందుకు కూడా అనుమతిని నిరాకరిస్తున్నారు. ఇది కార్మికుల హక్కులను అప్రాజాస్వామికంగా నిరాకరించటమేనని ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదనిఅన్నారు. కార్మిక పోరాటాలకు సిపిఎం అండగా ఉంటుందని తెలిపారు. పోలీసుల చర్యల మూలంగా ప్రజాస్వామ్యంలో చట్టబద్ధంగా పనిచేస్తున్న సిఐటియు నాయకులను సంఘ వ్యతిరేక శక్తులుగా చిత్రీకరించడమే అన్నారు. నిర్బంధాన్ని అరెస్టులను ఖండించారు. కార్మిక హక్కులపై కాంగ్రెస్ దాడి చేస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి పేర్కొన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలకు పలువురు సంఘీభావం తెలిపి రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. మహిళలకు ఉచిత బస్సు, గృహజ్యోతి పథకం మినహా ఏ ఒక్క గ్యారంటీని అమలు చేయలేదని పేర్కొన్నారు. ఆశా వర్కర్స్ కు వేతనం రూ.18,000 ఇవ్వాలని పిఎఫ్ సౌకర్యం అమలు, గ్రామ పంచాయితీ మున్సిపల్ ఆర్టీసీ విద్యుత్ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ బిల్డింగ్ హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలపరిష్కారం కోసం ఆందోళన పోరాటాలు చేస్తున్న కార్మికులతో బాధ్యత కల్గిన రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి కార్మిక సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపుసత్యనారయణ, వ్యవసాయ కార్మికసంఘంజిల్లా అధ్యక్షులు అన్నవరపుకనకయ్య, ఐఎఫ్టియునాయకులు సంజీవ్, ఐద్వానాయకు లక్ష్మి, డివైఎఫ్ఐ నాయకులు బాలరాజు, హరికృ కష్ణఎస్ ఎఫ్ ఐ నాయకులు నాగకృష్ణ, టిఆర్ఎస్ నాయకులు సురేష్ డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకుండా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తున్న కార్మికులను అణచివేస్తూ తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించటాన్ని ఖండించారు. సామూహిక దీక్ష ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా జిల్లా కోశాధికారి జి.పద్మ జిల్లా ఆఫీస్ బేరర్లు పిట్టల అర్జున్ దొడ్డ రవికుమార్ ఈసం వెంకటమ్మ భూక్య రమేష్ గద్దల శ్రీను సత్య రాజేష్ ధనలక్ష్మి సిపిఎం నాయకులు నర్సారెడ్డి పాల్గొన్నారు.




## ప్రభుత్వ బడుల అభివృద్ధికి "నవ లిమిటెడ్" సహకారం మరువలేనిది

- జిల్లా విద్యాశాఖ చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ టి.రామారావు
- నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 'కంటి' అద్దాల పంపిణీ

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** విద్యాభివృద్ధికి "నవ లిమిటెడ్" సహకారం మరువలేనిదని జిల్లా విద్యాశాఖ చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ టి.రామారావు అన్నారు. పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాలలో భాగంగా పాల్వంచ ప్రభుత్వ పాఠశాలలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం పాత పాల్వంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ చీఫ్ మానిటరింగ్ ఆఫీసర్ టి.రామారావు పాల్గొని మాట్లాడారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి 'నవ లిమిటెడ్' చేస్తున్న కృషిని అభినందించారు. అనంతరం సి ఎస్ ఆర్ హెడ్ డి.సుధాకర్ మాట్లాడుతూ నవ లిమిటెడ్ చేస్తున్న ఆరోగ్యం విద్యా జీవనోపాధి కార్యక్రమాలు వివరించారు.గత నెలలో ప్రభుత్వ పాఠశాలలలో నవ లిమిటెడ్ ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్య శిబిరంలో 1400 మంది విద్యార్థులకు పరీక్షలు చేయగా 170 మందికి ఉచితంగా మందులు పంపిన తర్వాత కంటిఅద్దాల పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి సివిల్ హెడ్ పి.గోపాలకృష్ణ, పాఠశాల ప్రధానోపాధ్యారాలు ఎస్.ప్రభావతి, ఇతర పాఠశాలల టీచింగ్ సిబ్బంది, సిఎస్ఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ దరఖాస్తు గడువు పెంపు

- ఈనెల 30వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి
- బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రం ప్రిన్సిపాల్ డా. కాంపల్లి శంకర్, కోఆర్డినేటర్ డా. ఎన్. ఏకాంబరం




**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఇంటర్ లేదా తత్సమాన అర్హతలు కలిగిన విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు గడువును ఈనెల 30వ తేదీ వరకు పెంచినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్ ఏకాంబరం తెలిపారు. ఇప్పటికే పలుమార్లు దరఖాస్తు గడువును పెంచిన నేపథ్యంలో విద్యార్థులు ఈసారి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ గడువులోగా దరఖాస్తు చేసుకొని సంబంధిత ప్రింట్ అవుట్ లకు సర్టిఫికెట్ల జిరాక్సులను జత చేసి కళాశాలలోని అంబేద్కర్ ఓపెన్ డిగ్రీ స్టడీ సెంటర్లో అందజేయాలన్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం తోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులలో అడ్మిషన్లు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు వారికి నచ్చిన సబ్జెక్టులను ఎంచుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ వరకు చదివిన వారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకొని వెరిఫికేషన్ కాని వారు కళాశాలలో సంప్రదించాలని వివరించారు....బెల్లంపల్లిలో ఏటా వందలాది మందికి దగ్గరవుతున్న దూరవిద్య...ప్రతి సంవత్సరం బెల్లంపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గల అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రం నుంచి వందల మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకుని పట్టాలు పొందుతున్నారని ప్రిన్సిపాల్ & కో ఆర్డినేటర్ తెలిపారు. స్థానికంగా లభిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## పదోన్నతుల కోసం ఈపీ ఆపరేటర్ల ఎదురుచూపులు

- మూడు సంవత్సరాల సర్వీసు పూర్తయినా ఏ గ్రేడ్‌కు నోచుకోని వైనం
- వెంటనే గ్రేడ్ పరీక్ష నిర్వహించి ఖాళీలను భర్తీ చేయాలి
- జీఎం పర్సనల్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన ఐఎన్‌టీయూసీ నేతలు



**సత్తుపల్లి, సెప్టెంబర్ 16:మహా :** సింగరేణి కొత్తగూడెం రీజియన్ పరిధిలో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఈపీ ఆపరేటర్ల పదోన్నతుల ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఐఎన్‌టీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి తీగల క్రాంతికుమార్, వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. అర్హత ఉన్నప్పటికీ పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న బీ గ్రేడ్ ఆపరేటర్లకు న్యాయం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ కార్యదర్శి జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు తీగల క్రాంతి కుమార్, బి కోటేశ్వరరావు సింగరేణి జనరల్ మేనేజర్ (పర్సనల్, పారిశ్రామిక సంబంధాలు, మానవ వనరుల నిర్వహణ) జి. వెంకట కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

**అర్హత ఉన్నా పదోన్నతుల కోసం నిరీక్షణ**

కొత్తగూడెం రీజియన్ పరిధిలోని మణుగూరు, కొత్తగూడెం, ఇల్లెందు, సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనిచేస్తున్న బీ గ్రేడ్ ఈపీ ఆపరేటర్లలో పలువురు సెప్టెంబరు 2025 నాటికి మూడు సంవత్సరాల సర్వీసు పూర్తి చేసుకున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం ఏ గ్రేడ్ పదోన్నతులకు అర్హత సాధించిన వారందరికీ వెంటనే అవకాశం కల్పించాలని కోరారు.

**గ్రేడ్ పరీక్ష నిర్వహించేందుకు హామీ**

ఈపీ ఆపరేటర్లకు సంబంధించి సీ గ్రేడ్ నుంచి బీ గ్రేడ్ పదోన్నతులు కల్పించినందుకు యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా ఏ గ్రేడ్ ఖాళీలను భర్తీ చేయడానికి అవసరమైన గ్రేడ్ పరీక్షను త్వరగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రంపై స్పందించిన జీఎం పర్సనల్ జి. వెంకట కిరణ్‌కుమార్, ఈపీ ఆపరేటర్లకు రావలసిన గ్రేడ్ పరీక్షను వీలైనంత త్వరగా నిర్వహించి పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తీగల క్రాంతికుమార్ వెల్లడించారు.

**పదోన్నతులతో సిబ్బందికి ప్రయోజనం**

సాంకేతిక నైపుణ్యంతో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈపీ ఆపరేటర్లకు అర్హతకు అనుగుణంగా పదోన్నతులు కల్పిస్తే ఉద్యోగుల ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు సంస్థ కార్యకలాపాల్లో మరింత ఉత్సాహంతో పనిచేసే అవకాశం ఉంటుందని ఐఎన్‌టీయూసీ నాయకులు పేర్కొన్నారు.

# సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా..

**మొయినాబాద్ సీఐ మల్లికార్జున్ రెడ్డి**



**మొయినాబాద్ మహా :** గణేష్ ఉత్సవాల సందర్భంగా సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని, రెచ్చగొట్టేలా పోస్టులు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని మొయినాబాద్ సీఐ మల్లికార్జున్ రెడ్డీ హెచ్చరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ. మొయినాబాద్ మండలంలోని గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. వాట్సాప్, ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్, తదితర సోషల్ మీడియా వేదికలపై పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతున్నట్లు తెలిపారు. మత విద్వేషాలను రెచ్చగొట్టేలా, ఇతర మతాల మనోభావాలను కించపరిచేలా, ప్రజల మధ్య ఉద్రిక్తతలు సృష్టించేలా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎలాంటి పోస్టులు, వీడియోలు, మెసేజ్లు లేదా కామెంట్లు చేసినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఇతరులు పంపిన రెచ్చగొట్టే లేదా అభ్యంతరకరమైన మెసేజ్లు, వీడియోలను ఫార్వర్డ్ చేయడం కూడా చట్టపరమైన సమస్యలకు దారితీయవచ్చని తెలిపారు. నిర్ధారణ లేని సమాచారాన్ని నమ్మకుండా, ఫార్వర్డ్ చేయకుండా ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సోదరభావంతో నిర్వహించేందుకు ప్రజలు, గణేష్ మండపాల నిర్వాహకులు, యువత పోలీసులకు సహకరించాలని కోరారు. ఎక్కడైనా అభ్యంతరకరమైన లేదా రెచ్చగొట్టే సోషల్ మీడియా పోస్టులు, వీడియోలు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. గణేశ్ ఉత్సవాలను ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

**డీజేలకు నో పర్మిషన్**

వినాయక ఉత్సవాల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తొందరపడి డీజేలకు అడ్వాన్స్ ఇవ్వవద్దని, అడ్వాన్స్ ఇస్తే తిరిగి వాపస్ తిసుకోవాలని సీఐ తెలిపారు. డల వ్యాప్తంగా అన్ని గ్రామాలోమండపాల వద్ద గాని ఊరేగింపులో గాని ఎలాంటి ఘర్షణలకు దిగిన శాంతి భద్రతలకు విఘాతం కల్పించిన ఉపేక్షించేది లేదని బాధ్యులపై కేసు నమోదు చేస్తామని నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తీవ్రంగా హెచ్చరించారు. మండపాల వద్ద నిమజ్జన ఊరేగింపులు పరిమిత సౌండ్ బాక్స్ లకు మాత్రమే అనుమతి ఉందన్నారు. మండపాల వద్ద కమిటీ నిర్వాహకులు ఎప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతా వరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని, పోలీస్ శాఖకు సహకరిస్తూ నిబంధనలను ప్రతి ఒక్కరు తప్ప నిసరిగా పాటించాలని సూచించారు.

# ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం

- **టిపిసిసి అధ్యక్షుడిగా రెండేళ్లు విజయవంతం**
- **టీజీ కాంగ్రెస్ రథసారధికి శుభాకాంక్షలు తెలిపిన డీసీసీ అధ్యక్షుడు అయూబ్**




**వరంగల్, బ్యూరో మహా ;** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ అధ్యక్షుడిగా రెండు సంవత్సరాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా, బుధవారం హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్, టీపీసీసీ అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం తో పాటు చిత్రపటాన్ని అందించి శాలువాతో సత్కరించి వరంగల్ జిల్లా ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పక్షాన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు అయూబ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడంలో, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడంలోనూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వం కీలకంగా నిలుస్తోందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే ప్రజల కోసం పోరాటం చేసే పార్టీ అని ప్రజా సంక్షేమం కోసం నిలబడే పార్టీ అని కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ముందుండేలా ఆయన నాయకత్వం అందిస్తున్నారని తెలిపారు.రాబోయే రోజుల్లో మహేష్ కుమార్ గౌడ్ మరింత ఉన్నత స్థాయి పదవులు అధిరోహిస్తూ ప్రభుత్వపరంగా పార్టీ పరంగా మరింత బలమైన శక్తిగా ఎదగాలని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు అండగా నిలిచి, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వం కొనసాగాలని అయూబ్ ఆకాంక్షించారు.



# ప్లాన్ ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలి

**ఓ.సి జారీకి భవనాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కమిషనర్ వెంకన్న**

**వరంగల్, కార్పొరేషన్ మహా ;** అనుమతి పొందిన ప్లాన్ ప్రకారమే భవన నిర్మాణాలు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అన్నారు. బుధవారం హనుమకొండ నగరంలోని గోపాల్పూర్, కాజీపేట, ప్రకాశ్ రెడ్డి పేట, పద్మాక్షి కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్మించిన భవనాలను క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించారు. భవనాలకు అక్యుపెన్సీ సర్టిఫికెట్ మంజూరు చేయడానికి సంబంధించి నిర్మాణాల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, భవన నిర్మాణదారులు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతి పొందిన బిల్డింగ్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అనుమతించిన ప్లాన్కు విరుద్ధంగా అదనపు నిర్మాణాలు చేపట్టకుండా, భవన నిర్మాణానికి సంబంధించిన అన్ని నిబంధనలు, ప్రమాణాలను తూచ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు



# పరిసరాల పరిశుభ్రతే ...ఆరోగ్యానికి శ్రీరామరక్ష

- **మాజీ కార్పొరేటర్ బాబు చొరవతో చెత్తకుప్పల తొలగింపు**
- **పరిశుభ్రంగా మారిన మంకాలమ్మ గుడి పరిసరాలు**

**జవహర్ నగర్, .మహా:** పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు పేర్కొన్నారు. జవహర్ నగర్ లోని శ్రీ మంకాలమ్మ దేవాలయం వద్ద గత కొన్ని రోజులుగా పేరుకుపోయిన చెత్తకుప్పలను స్థానిక బీజేపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ చొరవతో అధికారులు, పారిశుధ్య కార్మికులు పూర్తిస్థాయిలో శుభ్రం చేశారు.దేవాలయ ప్రాంగణంలో చెత్త భారీగా పేరుకుపోవడంతో తీవ్ర దుర్గంధం వెదజల్లడమే కాకుండా, భక్తులు స్థానికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గమనించిన పానుగంటి బాబు తక్షణమే స్పందించి, పారిశుధ్య సిబ్బందిని అక్కడికి పిలిపించారు. స్వయంగా దగ్గరుండిచెత్తకుప్పలను తొలగించి, ఆ ప్రాంతమంతా క్రిమిసంహారకాలతో శుభ్రపరిచేలా చర్యలు చేపట్టారు. ఈ చర్యతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.ఆలయ పరిసరాలు తిరిగి స్వచ్ఛంగా మారడంతో స్థానిక ప్రజలు, భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించిన మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబుకు, అలాగే పారిశుధ్య కార్మికులకు పరిసర ప్రాంత వాసులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆలయ పరిసరాల్లో చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని కోరారు.




# కార్మికుల ఆందోళనలపై నిర్బంధం తగదు

**కుషాయిగూడ,మహా:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి ఏ.అశోక్ ప్రారంభించారు. కార్మిక వర్గానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఆందోళనలు చేస్తున్న కార్మికులపై నిర్బంధాన్ని నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని, ఆశా కార్యకర్తలకు రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల వేతనాల నుంచి మినహాయించిన పీఎఫ్ మొత్తాన్ని ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ఆందోళనలను అడ్డుకోవడం సరికాదని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కే.ఉన్నికృష్ణ, ఎం.కిష్టప్ప, ప్రశాంత్, రమేష్, కలమ్మ, సుగుణ, నరసింహ, ఆరోగ్యం తదితరులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

# చర్లపల్లి, కుషాయిగూడలో పార్కుల అభివృద్ధికి రూ.2.81 కోట్లు



**కుషాయిగూడ,మహా:** చర్లపల్లి, కుషాయిగూడ డివిజన్ల పరిధిలో పార్కుల అభివృద్ధికి రూ.2.81 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ చేసిన కృషితో ఈ నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. విస్టా హోమ్స్, ఆఫీసర్స్ కాలనీ, వీఆర్ కాలనీ-సాయిరెడ్డి కాలనీ, విద్యామారుతి కాలనీలోని రెండు పార్కులు, రామకృష్ణనగర్, వెంకట్ రెడ్డినగర్ పార్కుల అభివృద్ధికి మొత్తం రూ.2.81 కోట్లు కేటాయించారు. బీఎన్ రెడ్డినగర్లో రహదారుల నిర్మాణానికి మరో రూ.98 లక్షలు మంజూరయ్యాయి. అలాగే కొమ్ము శ్మశాన వాటికకు రూ.53 లక్షలు, పెద్ద చర్లపల్లి బస్టాప్ సమీపంలోని ఎస్సీ శ్మశాన వాటికకు రూ.82 లక్షలు, చర్లపల్లిలోని బీసీ శ్మశాన వాటికకు రూ.51 లక్షలు కేటాయించారు. వీటికి మొత్తం రూ.1.86 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్బాబును కలిసి బొంతు శ్రీదేవి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధికి సహకరిస్తున్న టీపీసీసీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జి వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి మందుమూల పరమేశ్వర్రెడ్డికి అభినందనలు తెలిపారు.



# మహిళలందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

- **ఉల్లాస్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలి**
- **వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**
- **పది, ఇంటర్మీడియట్ అడ్మిషన్ల పై అసంతృప్తి వ్యక్తం చేసిన కలెక్టర్**

**వరంగల్, కలెక్టరేట్ మహా ;** వరంగల్ జిల్లాకు కేటాయించిన లక్ష్యానికి అనుగుణంగా ఉల్లాస్ పరీక్షలను విజయవంతంగా నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేసేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సెప్టెంబర్ 20వ తేదీన నిర్వహించనున్న ఉల్లాస్ పరీక్షకు ఉల్లాస్ పోర్టల్ లో నమోదైన ప్రతి మహిళ హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత మండల స్థాయిలోని అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ల పై ఉందన్నారు. పోర్టల్లో నమోదైన అభ్యర్థులందరినీ పరీక్షకు హాజరయ్యేలా ముందస్తుగా అవగాహన కల్పించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడం ద్వారా జిల్లాలో అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ అన్నారు. ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులకు విద్యను అందించి, వారిలో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించేలా క్షేత్రస్థాయిలో విస్తృతంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా వరంగల్ జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లు ఆశించిన స్థాయిలో లేవని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాకు కేటాయించిన అడ్మిషన్ లక్ష్యాన్ని పూర్తిచేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. అర్హులైన విద్యార్థులు ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా విద్యను కొనసాగించేలా విస్తృత ప్రచారం నిర్వహించి, నిర్దేశిత లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఉల్లాస్ పరీక్షలు, ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల లక్ష్యాలను సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు .ఈ సమావేశంలో జిల్లా డీఆర్డీఓ నాగపద్మజ, జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, అడల్ట్ ఎడ్యుకేషన్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, డీఎంసీ రేణుక, ఓపెన్ స్కూల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సదానందం, వరంగల్ జిల్లా ఉల్లాస్ ఇన్చార్జి నాగేశ్వరరావు, వివిధ మండలాల నుంచి హాజరైన అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

- **భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి**
- **పారిశుద్ధ్య నిర్వహణ పై కమిషనర్ ప్రత్యేక దృష్టి**
- **జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న**



**వరంగల్, కార్పొరేషన్ మహా ;** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలను సజావుగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.బుధవారం వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువులో గణేష్ నిమజ్జన ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. నిమజ్జన ప్రాంతంలో చేపట్టాల్సిన పారిశుద్ధ్య, ఇంజినీరింగ్, రహదారి తదితర ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం కోసం అధిక సంఖ్యలో గణేష్ విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్నందున, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇరిగేషన్, జిడబ్ల్యుఎంసి, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా చెరువులోకి గుర్రపుడెక్క చేరిన నేపథ్యంలో, నిమజ్జనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చెరువులో మిగిలి ఉన్న గుర్రపు డెక్కను కూడా వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ, రహదారులు, లైటింగ్, భక్తుల రాకపోకలు తదితర అంశాల పై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

**దేశాయిపేటలో పారిశుద్ధ్యం పరిశీలన**

అనంతరం కమిషనర్ 12వ డివిజన్ పరిధిలోని దేశాయిపేట ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ప్రధాన రహదారులు, పరిసర ప్రాంతాలు, డివైడర్లు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు జవాన్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశించారు. బిల్ బోర్డులు, అడ్వర్టైజింగ్ బోర్డులు, అనధికార ఫ్లెక్సీలు తదితరాలు ఏర్పాటు కాకుండా నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.

**క్రమం తప్పకుండా చెత్తను సేకరించాలి**

ప్రతి ఇంటి నుంచి స్వచ్ఛ ఆటో ద్వారా తడి, పొడి చెత్తను క్రమం తప్పకుండా వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చెత్త సేకరణలో ఎలాంటి జాప్యం లేకుండా, నిర్ణీత ప్రణాళిక ప్రకారం పారిశుద్ధ్య కార్యక్రమాలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.అలాగే ప్రణాళిక ప్రకారం స్వీపింగ్ మిషన్ల ద్వారా రహదారులను శుభ్రం చేయడంతో పాటు డివైడర్లను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు రోజువారీగా పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో సీఎం హెచ్ ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎం హెచ్ ఓ డాక్టర్ రాజేష్, సూపర్వైజర్ గోల్కొండ శ్రీను, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, జవాన్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కార్పొరేషన్ ఎన్నికలే కొండా దంపతులకు పెద్ద టాస్క్

**లండన్ కు కొండా సురేఖ**



**వరంగల్, మహా ;** తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనాలు రేపిన కొండా సురేఖ బర్తరఫ్ వ్యవహారం సొంత నియోజకవర్గంలో ఎటువంటి నిరసనలు, ఆందోళనలు లేకుండా కథ సుఖాంతమైంది. రాష్ట్ర మంత్రిగా చక్రం తిప్పాల్సిన కొండా సురేఖ సారీ చెప్పలేదని మంత్రి పదవి తీసేశారని తన ఇమేజ్ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు, కానీ అసలు సారీ చెప్పాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో అది మాత్రం చెప్పడం లేదు. రాజకీయ అవకాశం కోసం కుమార్తె అతిగా ఆవేశపడటంతోనే సమస్యలు వచ్చాయని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. కుమార్తెకు రాజకీయం నేర్పే ప్రయత్నం చేయకపోగా తాము కూడా ఆమె బాటలోనే వెళ్లాలని చూస్తే ఇప్పుడు అన్నీ కోల్పోయాక కొన్నాళ్లు సైలెంట్గా ఉండాలని అనుకుంటున్నారు. సుస్మిత ప్రస్తుతం లండన్ వెళ్లిపోయారని తెలుస్తోంది. కొన్నాళ్ల పాటు అక్కడే ఉండాలను కుంటున్నారు. తన వల్ల తల్లి మంత్రి పదవే పోయిందని ఆమె ఇటీవల సోషల్ మీడియాలో కన్నీళ్లు పెట్టుకుంటూ బాధపడడం అందరికీ తెలిసిందే. ఈ అంశం వల్ల ఇంకా ఎక్కువ సమస్యలు రాకూడదని కొన్నాళ్లు ఆమె లండన్ వెళ్లిపోవాలని నిర్ణయించు కున్నట్లుగా తెలుస్తోంది. సొంత నియోజకవర్గం లోని కార్యకర్తల్లో తమకు ఉన్న పట్టు నిరూపించు కోవడమే కొండా దంపతులకు ప్రస్తుతం పెద్ద టాస్క్ గా మారింది. రాబోయే వరంగల్ మహానగర పాలక సంస్థ కార్పొరేషన్ ఎన్నికలను వీరు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దశాబ్దాలుగా తమ వెంట నడిచిన పాత కార్యకర్తలకు, నమ్మకస్తులైన అనుచరులకు కార్పొరేటర్ టికెట్లు ఇప్పించు కోవడమే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నారని సమాచారం. ఒకవేళ పార్టీ పరంగా కొన్ని స్థానాల్లో సమన్వయ లోపం వచ్చినా లేదా కాంగ్రెస్ టికెట్ దక్కకపోయినా, తమ మద్దతుదారులను స్వతంత్ర అభ్యర్థులుగానైనా బరిలోకి దించి గెలిపించుకోవాలని , తద్వారా వరంగల్ నగరంలో కొండా దంపతుల మార్క్ ఆధిపత్యాన్ని చాటాలని భావిస్తున్నారు. మంత్రి పదవి కోల్పోవడం కొండా సురేఖను మానసికంగా కుంగదీసినప్పటికీ, రాజకీయంగా వెనక్కి తగ్గే ఆలోచనలో కొండా దంపతులు లేరని తెలుస్తోంది. వరంగల్ కార్పొరేషన్, పరకాల స్థానాల్లో సొంత వర్గాన్ని బలోపేతం చేసుకోవడం ద్వారా హైకమాండ్ కు తమ శక్తిని నిరూపించుకోవాలని చూస్తున్నారు. రాజకీయంలో తాత్కాలిక వెనుకంజలు సహజమే అయినప్పటికీ, కార్యకర్తల బలంతో మళ్లీ పుంజుకుని భవిష్యత్తులో కుమార్తెకు తిరుగులేని రాజకీయ భరోసా ఇవ్వడమే కొండా కుటుంబం ముందున్న ఏకైక లక్ష్యంగా కనిపిస్తోంది.

# యూజీడీ టెండర్లు త్వరగా పూర్తి చేయాలి



**హనుమకొండ, మహా:** వరంగల్ నగర అండర్గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ప్రాజెక్టు టెండర్ ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేసి పనులు ప్రారంభించాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ సెక్రెటరీ, సీడీఎంఏ డా. టి.కె. శ్రీదేవి అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో యూజీడీ ప్రాజెక్టు పురోగతిపై సమీక్షించారు. నిబంధనలు, సాంకేతిక ప్రమాణాలను పరిశీలించి టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో బల్దియా ప్రత్యేకాధికారి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పాయి, కమిషనర్ టి. వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# విశ్వకర్మ ఆశీస్సులతో... ఐక్యత ఆధ్యాత్మికత పెంపొందించాలి

**విరాట్ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం**

**జవహర్ నగర్, .మహా:** విశ్వకర్మ ఆశీస్సులతో ఐక్యత, ఆధ్యాత్మికత, సోదర భావం మరింత పెంపొందాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం జవహర్ నగర్ ప్రతినిధులు పేర్కొన్నారు. జవహర్ నగర్ లోని మహంకాళి దేవాలయ ప్రాంగణంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించనున్న విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి తరలి రావాలని కోరుతూ మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ ని మేడ్చల్ జిల్లా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డిని జవహర్ నగర్ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం సభ్యులు బుధవారం ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మహోత్సవ కార్యక్రమా వివరాలను తెలియజేసి యజ్ఞ మహోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆహ్వానం అందించారు. విశ్వకర్మ భగవానుడి ఆశీస్సులతో సమాజంలో ఐక్యత ఆధ్యాత్మికత సోదర భావం సౌభ్రాతృత్వం విశ్వ మానవత్వం మరింత పెంపొందాలని ఆకాంక్షిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఈ యజ్ఞ మహోత్సవానికి ప్రతి ఒక్కరు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ విశ్వ కర్మ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## 'మై లవ్' చిత్ర పోస్టర్ ,
# టీజర్ ఆవిష్కరణ

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో 'జోష్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ప్రొడక్షన్స్' పతాకంపై రూపుదిద్దుకుంటున్న 'మై లవ్' చిత్ర పోస్టర్ మరియు టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు రాష్ట్ర ఐటీ మరియు పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి, చిత్ర పోస్టర్ మరియు టీజర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, యువకుడు సంతోష్ ఎన్నో సంవత్సరాల పాటు పడిన కష్టాన్ని, తన సొంత ఆలోచనలతో సృజనాత్మకతను జోడించి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారని కొనియాడారు. ఈ సినిమా బలమైన కథతో, అందరినీ ఆకట్టుకునే అంశాలతో రూపొందుతున్నట్లు తెలిపారు. టీజర్ చాలా అద్భుతంగా వచ్చిందని, ఈ ప్రయత్నానికి తన పూర్తి మద్దతు ఉంటుందని మంత్రి భరోసానిచ్చారు. ఈ చిత్రం ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు , నిర్మాత సంతోష్ తగరం మాట్లాడుతూ, మంత్రి ప్రోత్సాహంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. సినిమాపై ఉన్న మక్కువతో ఇప్పటివరకు ఎవరూ స్పృశించని సరికొత్త కథాంశంతో ఈ సినిమాను రూపొందిస్తున్నామని చెప్పారు. పాన్‌ఇండియా స్థాయి విడుదల: కథ యొక్క విశిష్టతను దృష్టిలో ఉంచుకుని ఈ చిత్రాన్ని దేశవ్యాప్తంగా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. నటీనటులు: ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, ముప్పాళ్ల పృథ్వీరాజ్, పుష్పక కేశవ తదితరులు ప్రముఖ పాత్రలు పోషిస్తున్నారని తెలిపారు. అతి త్వరలోనే చిత్ర తదుపరి షూటింగ్ షెడ్యూల్ ప్రారంభం కానుందని పేర్కొన్నారు. మంత్రి ఆశీస్సులు చిత్ర బృందానికి ఎంతో ఉత్సాహాన్నిచ్చాయని, ప్రేక్షకుల ఆశీస్సులతో ఈ చిత్రం గొప్ప విజయం సాధిస్తుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు కూడా పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.

# అందాల తార రాశి సింగ్ సందడి

సినీ నటి రాశి సింగ్ తన తాజా ఫొటోషూట్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఎండకాంతి నిండిన ఆహ్లాదకరమైన వాతావరణంలో తీసిన ఫొటోలో ఆమె ఎంతో ఉల్లాసంగా కనిపించింది. గాలికి ఎగిరే పొడవాటి వేవీ హెయిర్‌తో నవ్వుతూ కనిపించిన రాశి సింగ్.. తన సహజమైన అందంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పింక్, పర్పుల్ రంగుల కలయికలో రూపొందించిన ఫ్లోరల్ ప్రింటెడ్ లెహంగా దుస్తులను ఆమె ధరించింది. ఎంబ్రాయిడరీ వర్క్‌తో ఉన్న బస్టియర్ బ్లౌజ్, దానికి జతగా ఉన్న ప్లీటెడ్ లెహంగా ఆమె లుక్‌కు మరింత అందాన్ని తీసుకొచ్చాయి. చెవులకు బంగారు జుంకాలు, చేతికి సన్నని బ్రేస్‌లెట్‌తో సింపుల్‌గా స్టైలిష్‌గా కనిపించింది. పచ్చని చెట్లతో కూడిన మార్గంలో మృదువైన సూర్యకాంతి మధ్య తీసిన ఈ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.ఈ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకున్న రాశి సింగ్.. అభిమానులతో సరదాగా మాట్లాడేలా ఓ ఆసక్తికరమైన క్యాప్షన్‌ను కూడా జత చేసింది. 'ఇలా రెడీ అయ్యి నేను ఎక్కడికి వెళ్తున్నానో తప్పు సమాధానాలు మాత్రమే చెప్పండి' అంటూ సరదాగా ప్రశ్నించింది. దీంతో అభిమానులు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ పోస్టును మరింత వైరల్ చేస్తున్నారు. స్టైలింగ్‌ను శాలు జైస్వానీ అందించగా, దుస్తులను ఎం.ప్రా. అధికారిక కలెక్షన్ నుంచి ఎంపిక చేసినట్లు పేర్కొంది. ఛత్తీస్‌గఢ్‌లోని భిలాయ్‌కు చెందిన రాశి సింగ్ తొలుత ఎయిర్ హోస్టెస్‌గా పనిచేసింది. ఆ తర్వాత సినీ రంగంపై ఆసక్తితో నటన వైపు అడుగులు వేసింది. 2021లో 'శశి' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమాలో ఆది సాయికుమార్ సరసన నటించి గుర్తింపు తెచ్చుకుంది. అనంతరం 'ప్రేమ్ కుమార్' చిత్రంతో పాటు 'పాపం పసివాడు' వెబ్ సిరీస్‌లోనూ కనిపించింది. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ తన నటనా పరిధిని పెంచుకుంటున్న రాశి.. 2024లో వచ్చిన 'భూతద్దం భాస్కర్ నారాయణ'లో లక్ష్మి పాత్రలో, 'ప్రసన్న వదనం'లో ఏసీపీ వైదేహి పాత్రలో నటించి ప్రశంసలు అందుకుంది. ఇటీవలి కాలంలో 'బ్లైండ్ స్పాట్', 'పంచ్ మినార్', 'సంతాన ప్రాప్తిరస్తు' వంటి ప్రాజెక్టులతో ప్రేక్షకులను పలకరించిన రాశి సింగ్.. ప్రస్తుతం కూడా వరుస అవకాశాలతో బిజీగా ఉంది. 2026లో 'ట్రాన్స్‌ఫర్', 'త్రిమూర్తులు', 'గాసిప్', 'రంభ ఊర్వశి మేనక' వంటి ప్రాజెక్టుల్లో భాగమవుతోంది. నటనతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉంటూ తన ఫొటోషూట్లు, సినిమా అప్‌డేట్లను అభిమానులతో పంచుకుంటోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఈ కొత్త లుక్‌కు మంచి స్పందన లభిస్తోంది.





# అక్టోబర్ 16న రణబాలి విడుదల

**హైదరాబాద్, మహా:** విజయ్ దేవరకొండ, దర్శకుడు రాహుల్ సాంకృత్యాన్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ చిత్రం 'రణబాలి'పై నెలకొన్న విడుదల తేదీపై సందిగ్ధతకు తెరపడింది. సినిమా షూటింగ్ పూర్తయిందని, ముందుగా ప్రకటించిన ప్రకారమే దసరా సందర్భంగా అక్టోబర్ 16న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం స్పష్టం చేసింది. దీంతో సినిమా డిసెంబర్‌కు వాయిదా పడుతుందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారానికి చెక్ పడింది.ఇటీవల 'రణబాలి' విడుదల తేదీ మారనుందంటూ పలు రకాల వార్తలు వైరల్ అయ్యాయి. సినిమా షూటింగ్‌లో కొంత భాగం ఇంకా మిగిలి ఉందని, భారీ స్థాయిలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తికావాల్సి ఉందనే ప్రచారం జరిగింది. మరోవైపు దసరా బరిలో ఇతర భారీ చిత్రాలు ఉండటంతో 'రణబాలి'ని డిసెంబర్‌కు మార్చే అవకాశం ఉందంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు వినిపించాయి.అయితే తాజాగా విజయ్ దేవరకొండ తనకు సంబంధించిన షూటింగ్‌ను పూర్తి చేయడంతో చిత్రబృందం కీలక దశను అధిగమించింది. ఇక మిగిలిన సమయాన్ని పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్ తదితర పనులపై కేటాయించనున్నట్లు తెలుస్తోంది. 'టాక్సీవాలా' తర్వాత విజయ్ దేవరకొండ, రాహుల్ సాంకృత్యాన్ కలిసి చేస్తున్న చిత్రం కావడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.ఇటీవల విడుదలైన గ్లింప్స్‌కు మంచి స్పందన రావడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. పీరియాడిక్ నేపథ్యం, యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని దసరా సందర్భంగా అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ మరోసారి స్పష్టం చేశారు. దీంతో విజయ్ దేవరకొండ అభిమానుల్లో సందడి నెలకొంది.

# రుక్మిణి వసంత్ గ్లామరస్ లుక్



కన్నడ నటి రుక్మిణి వసంత్ మరోసారి తన అందం, అభినయంతో అభిమానులను ఆకట్టుకున్నారు. మారూన్ రంగు వన్‌షోల్డర్ గౌన్‌లో ఆమె మెరిసిపోయారు. గౌన్‌కు జతగా ఉన్న ఫ్లోయింగ్ కేప్, నడుముకు అలంకరించిన గోల్డ్ డిజైన్ బెల్ట్ ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్టేట్‌మెంట్ గోల్డ్ చోకర్ నెక్లెస్, ఉంగరాలతో ఆమె స్టైలిష్ లుక్‌ను పూర్తి చేశారు. వెచ్చని బ్యాక్‌డ్రాప్‌లో తీసిన ఫొటోల్లో రుక్మిణి వసంత్ ఎంతో హుందాగా కనిపించారు. 'కాంతార: చాప్టర్ 1'లో కనకవతి పాత్రకు వచ్చిన గుర్తింపును పురస్కరించుకుని ఆమె ఈ ఫొటోలను పంచుకున్నారు.ఈ సందర్భంగా రుక్మిణి వసంత్ తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ.. ''ఈ గౌరవాన్ని అందించిన SIIMA అవార్డ్స్‌కు, మా సినిమాను, కనకవతి పాత్రను నాతో కలిసి సెలబ్రేట్ చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు'' అని సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ఫొటోగ్రఫీ, మేకప్, హెయిర్ స్టైలింగ్, ఆభరణాలు, దుస్తుల ఎంపికలో సహకరించిన వారికి కూడా ఆమె కృతజ్ఞతలు తెలిపారు.బెంగళూరులో జన్మించిన రుక్మిణి వసంత్ లండన్‌లోని రాయల్ అకాడమీ ఆఫ్ డ్రామాటిక్ ఆర్ట్‌లో శిక్షణ పొందారు. 2019లో విడుదలైన కన్నడ థ్రిల్లర్ 'బిర్బల్ ట్రిలోజీ'తో నటిగా సినీ రంగ ప్రవేశం చేశారు. 2023లో వచ్చిన రెండు భాగాల రొమాంటిక్ డ్రామా 'సప్త సాగరదాచే ఎల్లో'తో ఆమెకు మంచి గుర్తింపు లభించింది. ఈ చిత్రంలోని నటనకు ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డ్స్‌లో ఉత్తమ నటి-కన్నడ పురస్కారం దక్కింది.ఆ తర్వాత రుక్మిణి వసంత్ తెలుగు, తమిళ చిత్రసీమల్లోనూ అడుగుపెట్టారు. 2024లో 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. 2025లో 'ఏస్', 'మధరాసి' చిత్రాలతో తమిళంలోనూ నటించారు. అదే ఏడాది విడుదలైన 'కాంతార: చాప్టర్ 1'లో కనకవతి పాత్రలో నటించి మరింత గుర్తింపు తెచ్చుకున్నారు.ప్రస్తుతం రుక్మిణి వసంత్ పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. యశ్‌కు జోడీగా 'టాక్సిక్: ఏ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్‌అప్స్'లో నటిస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్‌తో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్'లోనూ భాగమయ్యారు. మలయాళంలో నివిన్ పౌలీతో కలిసి 'NP51' చిత్రంతో అరంగేట్రం చేయనున్నారు. 'మంగళ గౌరి' అనే మరో చిత్రంలోనూ ఆమె నటిస్తున్నారు.

# కంటెంట్ పాత్రల వైపు రష్మిక



**హైదరాబాద్, మహా :** పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందన్న తన కెరీర్‌లో కొత్త తరహా పాత్రల వైపు అడుగులు వేయనున్నారనే చర్చ సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ చిత్రాలతో పాటు గ్లామర్, రొమాంటిక్ పాత్రల్లో కనిపించిన ఆమె.. ఇకపై నటనకు ఎక్కువ ప్రాధాన్యత ఉన్న కథలను ఎంచుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం. బలమైన కథాంశంతో పాటు తన పాత్రకు కథలో ప్రాధాన్యత ఉండేలా ప్రాజెక్టులను ఎంపిక చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు టాక్. ఇటీవల వరుస విజయాలతో రష్మికకు పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు మరింత పెరిగింది. ఈ నేపథ్యంలో కేవలం స్టార్ ఇమేజ్‌కు సరిపోయే పాత్రలకే పరిమితం కాకుండా, నటిగా తన ప్రతిభను ప్రదర్శించే అవకాశాలపై ఆమె దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో రొటీన్ గ్లామర్ పాత్రలను తగ్గించి, వైవిధ్యమైన క్యారెక్టర్లకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించుకున్నారనే ప్రచారం జరుగుతోంది.ఈ క్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసురాలు ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవితం ఆధారంగా రూపొందనున్న బయోపిక్‌లో రష్మిక నటించనున్నారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. ఈ ప్రాజెక్ట్‌కు ఆమె అంగీకరించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.ఎం.ఎస్. సుబ్బులక్ష్మి వంటి మహోన్నత వ్యక్తిత్వాన్ని తెరపై ఆవిష్కరించడం నటిగా సవాల్‌తో కూడుకున్న అంశం. అలాంటి పాత్ర ద్వారా తనలోని మరో కోణాన్ని ప్రేక్షకులకు పరిచయం చేసే అవకాశం రష్మికకు లభిస్తుందని అభిమానులు భావిస్తున్నారు. బయోపిక్‌తో పాటు పెర్ఫార్మెన్స్ ఓరియెంటెడ్ చిత్రాలపై ఆమె ఆసక్తి చూపుతున్నారనే వార్తలు ప్రస్తుతం టాలీవుడ్, బాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# ప్రభాస్ లైనప్‌పై భారీ అంచనాలు



హైదరాబాద్, మహా: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చేతిలో ప్రస్తుతం పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. 'ది రాజా సాబ్' తర్వాత ఆయన నటిస్తున్న సినిమాలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. రాబోయే రెండుమూడేళ్లలో విభిన్న కథాంశాలు, భారీ నిర్మాణ విలువలతో కూడిన చిత్రాలతో ప్రభాస్ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఫౌజీ' పీరియాడిక్ వార్ డ్రామాగా రూపొందుతున్నట్లు సమాచారం. 1940ల కాలం నాటి నేపథ్యంతో సాగే ఈ చిత్రంపై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. 2026 చివర్లో లేదా 2027 ప్రారంభంలో విడుదలయ్యే అవకాశాలున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న 'స్పిరిట్' మరో కీలక చిత్రం. యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రభాస్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నట్లు సమాచారం. అలాగే నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'కల్కి 2898 ఏడీ'కి సీక్వెల్‌గా 'కల్కి 2' రూపొందుతోంది. ఈ సైన్స్ ఫిక్షన్ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి.మరోవైపు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'సలార్ 2: శౌర్యాంగ పర్వం' కూడా లైనప్‌లో ఉంది. ఖాన్సార్ కథను కొనసాగిస్తూ ఈ సినిమా తెరకెక్కనుంది. ఇలా పీరియాడిక్ డ్రామా, యాక్షన్, సైన్స్ ఫిక్షన్ వంటి విభిన్న జానర్లలో ప్రభాస్ వరుసగా కనిపించనున్నారు. ప్రతి సినిమాపై భారీ అంచనాలు ఉండటంతో ప్రేక్షకుల అంచనాలను అందుకోవడం ఇప్పుడు ఆయన లైనప్‌కు కీలకంగా మారింది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com